JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | శుక్రవారం 08-05-2026
Medchal - Malkajgiri | Friday 08-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 341
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 341 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com


# రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా విస్తరణ



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ అంతటా హైడ్రాను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్జంగా హైడ్రాకు వినతులు వస్తున్నాయని.. ఈ నేపథ్యంలో హైడ్రా పరిధిని రాష్ట్రమంతటా విస్తరించాలని నిర్ణయించినట్లు వివరించారు. గురువారం నల్గొండ జిల్లాలో పర్యటించిన హైడ్రా కమిషనర్.. ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటి వరకూ కోట్ల విలువైన భూములను కబ్జాదారుల చెర నుంచి హైడ్రా కాపాడినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాను విస్తరించాలని.. తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా వెల్లడించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో రంగనాథ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా సేవలు విస్తరించాలంటూ ...మిగతాది 2 లో

# బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలి

- రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ.. వారానికో శంకుస్థాపన
- స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్‌కే పరిమితం కాకూడదు
- పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో.. పబ్లిక్ డెలివరీ అంతే ముఖ్యం
- వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరతను అధిగమించవచ్చు
- కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశా.. ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చాం
- 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం




జయభేరి, అమరావతి, మే 7:

అభివృద్ధి సహా వివిధ రంగాల్లో బెంచ్ మార్క్ సెట్ చేసేలా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడుకునేవారో... ఇప్పుడేం మాట్లాడుకుంటున్నారో ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి గ్రామస్థాయి ఉద్యోగులను కూడా మోటివేట్ చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లే తీసుకోవాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో రెండు రోజులపాటు జరిగే 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలకుల నుంచి రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు ప్రభుత్వానికి సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసింది. రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు కూడా గత పాలకులు మనపై రుద్దారు. గత పాలకుల నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలు పడిన రోడ్లతో విధ్వంసమైంది. అందరి సహకారంతో అలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కి... వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం. ప్రజా ప్రతినిధులుఅధికారుల కలయికే ప్రభుత్వం. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత. ఇప్పుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాం. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.




- కరీంనగర్ లో టెన్షన్.. టెన్షన్..
- బండి సంజయ్, కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల తూటాలు
- బీఆర్ఎస్ నేతల మాటలకు ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ శ్రేణులు దాడులకు దిగబడ్డారు
- తంబాకు, డ్రగ్స్ తినే అలవాటులో బండి సంజయ్ ఏదేదో మాట్లాడుతున్నారు
- పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్

*తెలంగాణలో నేతల మాటలు శృతి మించుతున్నాయి. ఈ మాటల మంటలు కారణంగానే కరీంనగర్‌లో ఉద్రికత పరిస్థితులు నెలకొన్నాయి. బండి సంజయ్, కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల తూటాలు, సవాళ్ల పర్వం సాగుతోంది. ఇది కాస్త దాడుల వరకు వెళ్లింది. బీఆర్ఎస్ నేతల మాటలకు ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ శ్రేణులు దాడులకు దిగబడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేశారు. ప్రెస్ మీట్ జరుగుతుండగానే బీజేపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారు.*

జయభేరి, కరీంనగర్, మే 7 :

తెలంగాణలో నేతలు రేవంత్, కేటీఆర్ కుమ్మక్కు అయ్యారని అందుకే కాళేశ్వరం సహా ఏ కేసులు కూడా ముందుకు కదలడం లేదని బండి సంజయ్ ఆరోపించారు. దీనిపై కేటీఆర్ కౌంటర్ ఇస్తూ ఎవరు ఎవరితో కుమ్మక్కు అయ్యారో తమకు తెలుసని అన్నారు. చాలా విషయాలు తమ వద్ద ఉన్నాయని సమయం వచ్చినప్పుడు అన్నింటినీ బయటపెడతామన్నారు. ఎవరికి ఎవరు సహాయ మంత్రిగా ఉన్నారో తేలుస్తామని అన్నారు. కచ్చితంగా ఒక్కో విషయం వెలుగులోకి వస్తుందని అన్నారు. దీనిపై బండి సంజయ్ ప్రెస్‌మీట్ పెట్టి కేటీఆర్‌పై తీవ్ర పదజాలంతో దూషించారు. మనిషి పుట్టక అంటూ అసభ్యంగా మాట్లాడారు. కరీంనగర్‌లో పూర్తిగా కేటీఆర్‌ను తిరగనివ్వబోమని అన్నారు. తనపై చేసిన ఆరోపణలు రుజువులు చూపించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ మత్తులో ఏదేదో మాట్లాడుతున్నారని దునుమాడారు. దీనికి బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. డ్రగ్స్ వాడే అలవాటు బండి సంజయ్‌కు ఉందని అన్నారు. ...మిగతాది 2 లో



# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- తెలంగాణలోని పేద ప్రజలకు శుభవార్త
- మే 20వ తేదీలోగా పూర్తి చేయాలని పొంగులేటి ఆదేశాలు

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలోని పేద ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభవార్త వినిపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఈ నెల 20లోగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. అలాగే అర్హులైన వారికే ...మిగతాది 2 లో



# వడ్డీ లేని రుణం రెట్టింపు
# రూ.10 లక్షలకు పెంపు

- తెలంగాణలోని మహిళా సంఘాలకు శుభవార్త
- రుణాలపై వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది
- పేదరికం నుంచి మహిళలు బయట పడినప్పుడే.. సంపూర్ణ అభివృద్ధి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పం
- తెలంగాణ మంత్రి సీతక్క వెల్లడి

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం తీపికబురు వినిపించింది. మహిళా సంఘాలకు ఇచ్చే వడ్డీ లేని రుణాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఈ విషయాన్ని మంత్రి సీతక్క వెల్లడించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకునే రూ.10 లక్షలలోపు రుణాలకు ప్రభుత్వమే వడ్డీని భరిస్తుందని తెలిపారు. ప్రజాభవన్‌లో జరిగిన మహిళా సంఘాలకు ఇచ్చే బ్యాంకు వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణకు మంత్రి సీతక్క హాజరయ్యారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ వినిపించింది. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ రుణాల పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘాలకు ప్రస్తుతం వడ్డీ లేని రుణాలను ...మిగతాది 2 లో

# తమిళనాడులో ఏం జరుగుతోంది?
## విజయ్ సీఎం అవుతారా.? లేదా.? అసలేంటీ డైలమా.?

...మిగతాది 2 లో

# మీకు దేశం రుణపడి ఉంటుంది

- ఆపరేషన్ సింధూర్ వీరులకు మోదీ సలాం
- సోషల్ మీడియాలో సింధూర్ గర్జన
- నాడు విషాదం.. నేడు విజయగీతం



జయభేరి, న్యూఢిల్లీ :

దేశ భద్రతా చరిత్రలో ఒక నవ శకాన్ని లిఖించిన ఆపరేషన్ సింధూర్‌కు నేటితో ఏడాది పూర్తైంది. పహల్గామ్ నెత్తుటి గాయానికి ప్రతీకారంగా, శత్రువుల గుండెల్లోకి దూరి భారత్ జరిపిన ఈ మెరుపు దాడికి ఏడాది పూర్తవడంతో దేశం మొత్తం సైన్యం పరాక్రమాన్ని గుర్తు చేసుకుంటోంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సైనికుల ధైర్యసాహసాలను కొనియాడారు. "ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ప్రతి ఒక్క సైనికుడికి దేశం రుణపడి ఉంటుంది. అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో, క్లిష్ట సమయాల్లో అచంచలమైన పట్టుదలతో శత్రువులను వేటాడిన మన దళాల పోరాట పటిమ అనన్యసామాన్యం" అని ఆయన ...మిగతాది 2 లో

# నెక్స్ట్ సీఎం ఎవరు..?

- మమతా బెనర్జీ సర్కార్‌ను బర్తరఫ్ చేసిన గవర్నర్
- బెంగాల్‌లో తొలి బీజేపీ సర్కార్ కొలువు



జయభేరి, న్యూఢిల్లీ :

గవర్నర్ రవి బెంగాల్‌లో మమతా బెనర్జీ సర్కార్‌ను బర్తరఫ్ చేశారు. సీఎం పదవికి రాజీనామా చేయడానికి మమత బెనర్జీ ఒప్పుకోకపోవడంతో గవర్నర్ గురువారం ఈ నిర్ణయం తీసుకున్నారు. మమతా రాజీనామా చేయకపోవడంతో గడువు ముగిసిన వెంటనే బెంగాల్ అసెంబ్లీని రద్దు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తామే గెలిచామని, రాజీనామా చేసే ప్రసక్తే లేదన్నారు మమత. ఎల్లుండి బెంగాల్‌లో తొలి బీజేపీ సర్కార్ కొలువు తీరుతుంది. ఉదయం 10 గంటలకు బ్రిగేడ్ గ్రౌండ్స్‌లో కొత్త సీఎం ప్రమాణం చేస్తారు. శుక్రవారం జరిగే బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సీఎంను ఎన్నుకుంటారు. అమిత్‌షా సమక్షంలో సీఎం ఎంపిక జరుగుతుంది ...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## మీకు దేశం రుణపడి ఉంటుంది

అన్నారు. కేవలం సైనిక చర్యగానే కాకుండా దేశ ప్రజల్లో భద్రతా భావాన్ని నింపడంలో ఈ ఆపరేషన్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని అభిప్రాయపడ్డారు.

**సోషల్ మీడియాలో సింధూర్ గర్జన**

ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ తన X (ట్విట్టర్) ప్రొఫైల్ ఫోటోను ఆపరేషన్ సింధూర్ చిహ్నంగా మార్చడం విశేషం. అటు భారత వాయుసేన విడుదల చేసిన సరికొత్త వీడియో ఇప్పుడు నెట్టింట సంచలనం సృష్టిస్తోంది. "భారత్ దేనినీ క్షమించదు" అనే ట్యాగ్‌లైన్‌తో ఉన్న ఈ వీడియోలో.. ఉగ్రవాద శిబిరాలను మన దళాలు ఎలా నామరూపాలు లేకుండా చేశాయో కళ్లకు కట్టినట్లు చూపించారు.

**నాడు విషాదం.. నేడు విజయగీతం**

2025 ఏప్రిల్ 22న పహల్గామ్ సమీపంలోని బైసారన్ లోయలో ఉగ్రవాదులు 26 మంది అమాయక పర్యాటకులను పొట్టనబెట్టుకున్నారు. ఈ దాడి భారత సార్వభౌమాధికారాన్ని సవాలు చేసేలా ఉండటంతో భారత సైన్యం మే 7న అత్యంత వ్యూహాత్మకంగా ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించింది. పాకిస్థాన్, PoKలోని ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించడంలో ఆధునిక సాంకేతికతను వాడారు. సరిహద్దులు దాటి మరీ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసి శత్రువులకు కోలుకోలేని దెబ్బ తీశారు. అంతర్గత భద్రత విషయంలో భారత్ ఎక్కడా రాజీ పడదని ఈ ఆపరేషన్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పారు.

## నెక్స్ట్ సీఎం ఎవరు..?

బెంగాల్ సీఎం ఎవరన్న విషయంపై సస్పెన్స్ కొనసాగుతోంది. అయితే సీఎం రేసులో సువేందు అధికారి ముందంజలో ఉన్నారు. భవానీపూర్‌లో మమతా బెనర్జీని ఓడించారు సువేందు అధికారి.. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో పాటు కేంద్రమంత్రులు హాజరవుతారు. 5000 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. బెంగాల్ సీఎం పదవి బెంగాలీకే దక్కుతుందని అమిత్‌షా స్పష్టం చేశారు. బెంగాలీ మీడియం చదువుకున్న వాళ్లనే సీఎం చేస్తామని స్పష్టంచేశారు. అయితే, ఈ అర్హతలు సువేందు అధికారికే మాత్రమే ఉన్నాయంటూ పేర్కొంటున్నారు.

## రూ.10 లక్షలకు పెంపు

రూ.5 లక్షల వరకూ అందిస్తున్నారు. అయితే ఈ మొత్తాన్ని తెలంగాణ ప్రభుత్వం ఐదు లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచింది. ఈ విషయాన్ని మంత్రి సీతక్క వెల్లడించారు. బ్యాంకు నుంచి మహిళా సంఘాలు తీసుకునే రూ.10 లక్షల రుణాలపై వడ్డీ మొత్తాన్ని తెలంగాణ ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గురువారం రోజున ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక బృందాలకు ఇచ్చే బ్యాంకు వార్షిక రుణ ప్రణాళికను సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి సీతక్క.. గత ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు రూ.25,228.89 కోట్ల మేరకు బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు వెల్లడించారు. మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి అనేదే తెలంగాణ ప్రభుత్వం నినాదమన్నారు మంత్రి సీతక్క. పేదరికం నుంచి మహిళలు బయట పడినప్పుడే.. సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు మహిళలకు ఈ సంవత్సరం రూ.26 వేలకోట్లకు పైగా బ్యాంకు రుణాలు అందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు.. పంట కొనుగోలు కేంద్రాల్లో 40 శాతం అప్పగిస్తామని వెల్లడించారు. తీసుకున్న బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించే విషయంలో మహిళా స్వయం సహాయక సంఘాలు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నాయని కొనియాడారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్పీఏ సాధించడం చరిత్రాత్మకమన్న సీతక్క.. నిర్మల్ జిల్లాను స్ఫూర్తిగా తీసుకుని అన్ని జిల్లాలు వందశాతం రీపేమెంట్ సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు వడ్డీ లేని రుణాన్ని 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్ నిర్ణయంపై మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

డబుల్ బెడ్రూమ్ ఇళ్లు దక్కేలా స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. తెలంగాణలోని పేద ప్రజలకు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభవార్త వినిపించారు. మే 20వ తేదీలోగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే అర్హులైన పేద ప్రజలను లబ్ధిదారులుగా ఎంపిక చేసేలా.. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలో భూములను సేకరించిన సంగతి తెలిసిందే. ఆ భూములలో వినియోగించని వాటిని అర్హులైన పేదలకు అందించేలా.. వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లకు సూచించారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై ఉమ్మడి మహబూబ్ నగర్. నల్గొండ జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చటంతో పాటుగా.. నిజమైన భూమి యజమానులకు చట్టపరమైన హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, లబ్ధిదారులకు లబ్ధిని చేకూర్చాలని కోరారు.

ఇక ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో జిల్లా కలెక్టర్లకే ఎక్కువ అధికారాలను ఇచ్చినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు విడుదలయ్యేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. అక్రమాలకు తావులేకుండా ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫలాలు అర్హులకే దక్కేలా చూడాలని.. ఈ విషయంలో ఎక్కడైనా పొరపాటు జరిగితే ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో లక్ష మందికిపైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్‌ను నియమించనున్నట్లు మంత్రి తెలిపారు. దీనిపై కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ఆఫీసులకు నూతన భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య భూవివాదాల సమస్యకు పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## శిరీష ను చంపిన భర్తను ఎన్ కౌంటర్ చేయాలి

**జయభేరి, హైదరాబాద్ :**

జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్కు చెందిన వడ్డెర సంఘం యూనియన్ సమక్షంలో శిరీష మృతురాలి కి న్యాయం సమకూర్చే విధంగా పోరాడుతామని శిరీషను హత్య చేసిన అంతకుడికి తన భర్తకి ఎన్కౌంటర్ చేయాలని ఇటువంటి నేరం మరెప్పటికీ చేయకుండా అందరికీ బుద్ధి వచ్చేటట్లుగా ఉండాలని ప్రతి ఒక్క ఆడపిల్ల తలెత్తుకొని రోడ్డు మీద నడిచే విధంగా ఎవరైనా భయంతో ఉండాలని ఇటువంటి నరకయాతన మరి ఏ ఆడపిల్లకు రాకూడదని శిరీష లాంటి ఆడపిల్లలకు న్యాయం జరగాలని సిఐ శివ శంకరును రాతాపూర్వకంగా కోరారు శిరీష కు న్యాయం జరిగే వరకు పోరాడుతామని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో న్యాయం జరిగే విధంగా పోరాడుతామని విలేకరులకు తెలియజేశారు

# తమిళనాడులో ఏం జరుగుతోంది?

## విజయ్ సీఎం అవుతారా.? లేదా.? అసలేంటీ డైలమా.?



తమిళనాడు రాజకీయాలు సినిమా ట్విస్టులను తలపిస్తున్నాయి. ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు ఇంకా దూరంగానే ఉంది. దీంతో విజయ్ సీఎం ప్రమాణ స్వీకారం పలు నాటకీయ పరిణామాలకు కేంద్ర బిందువవుతోంది.

**తమిళనాడులో రాజకీయ థ్రిల్లర్..**

తమిళనాడు రాజకీయాల్లో ఎన్నడూ చూడని ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా నిలిచిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ ఏర్పాటుకు ఇంకా దూరంగానే ఉంది. పార్టీ అధినేత విజయ్ వరుసగా గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు దిశగా స్పష్టత రావడం లేదు. "అతి పెద్ద పార్టీకి ముందుగా అవకాశం ఇవ్వాలా? లేక పూర్తి మెజార్టీ నిరూపించిన తర్వాతే ఆహ్వానం ఇవ్వాలా?" అన్న చర్చ ఇప్పుడు తమిళనాడు రాజకీయాల కేంద్రబిందువుగా మారింది.

**మెజార్టీ దగ్గర ఆగిపోయిన విజయ్ లెక్కలు**

234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో టీవీకే 108 సీట్లు గెలుచుకుంది. అయితే విజయ్ రెండు నియోజకవర్గాల్లో విజయం సాధించడంతో ఒక సీటును వదులుకోవాల్సి వస్తోంది. దీంతో పార్టీ బలం 107కి తగ్గనుంది. కాంగ్రెస్ మద్దతుతో ఈ సంఖ్య 112కి చేరినా, ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 118 సంఖ్య ఇంకా అందుబాటులోకి రాలేదు. అంటే విజయ్‌కు కనీసం మరో ఆరుగురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం వామపక్షాలు, వీసీకే, చిన్న ప్రాంతీయ పార్టీలు ఏ వైపు నిలుస్తాయన్నదే కీలక అంశంగా మారింది. ఇదే కారణంగా గవర్నర్ కూడా "ముందుగా పూర్తి మెజార్టీ చూపించండి" అనే వైఖరిలో ఉన్నట్లు తెలుస్తోంది.

**గవర్నర్ ఎందుకు వేచి చూస్తున్నారు?**

విజయ్ ఇప్పటికే రెండుసార్లు గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అసెంబ్లీలో 15 రోజుల్లో బల నిరూపణ చేసుకుంటానని కూడా హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే గవర్నర్ మాత్రం రాజ్‌భవన్‌లో సంఖ్యాబలం స్పష్టంగా కనిపించాల్సిందేనని అభిప్రాయపడుతున్నారు. "అసెంబ్లీలో నిరూపించుకునే అవకాశం ఇవ్వాలి" అని టీవీకే వాదిస్తుండగా, "ముందుగా మెజార్టీ ఆధారాలు చూపాలి" అని గవర్నర్ కార్యాలయం చెబుతోంది. ఈ వివాదమే ప్రస్తుతం సీఎం ప్రమాణ స్వీకారం ఆలస్యానికి ప్రధాన కారణంగా మారింది.

**చిన్న పార్టీల చేతుల్లో తమిళ రాజకీయ భవిష్యత్**

ప్రస్తుతం తమిళనాడులో చిన్న పార్టీల పాత్ర అత్యంత కీలకంగా మారింది. సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలు టీవీకేకు మద్దతు ఇవ్వొచ్చన్న సంకేతాలు వస్తున్నాయి. అయితే ఇంకా ఎవరూ అధికారిక ప్రకటన చేయలేదు. డీఎంకే కూడా ఆసక్తికరమైన వైఖరి తీసుకుంది. "అతి పెద్ద పార్టీగా టీవీకేకే ముందుగా అవకాశం ఇవ్వాలి" అని చెబుతున్నప్పటికీ ప్రత్యక్ష మద్దతుపై స్పష్టత ఇవ్వడం లేదు. ఇక ఏఐఏడీఎంకే మాత్రం టీవీకేకు మద్దతు లేదని తేల్చి చెప్పింది. అయినప్పటికీ ఆ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు విజయ్ వైపు మొగ్గుచూపుతున్నారన్న ప్రచారం రాజకీయ ఉత్కంఠను మరింత పెంచుతోంది.

**సీఎం కాన్వాయ్ తిరిగి ఇచ్చేసిన విజయ్**

ప్రోటోకాల్ ప్రకారం ఎన్నికల ఫలితాల అనంతరం విజయ్‌కు ముఖ్యమంత్రి స్థాయి భద్రత, కాన్వాయ్ వాహనాలు అందించారు. కానీ ప్రభుత్వం ఏర్పాటు విషయంలో స్పష్టత రాకపోవడంతో విజయ్ ఆ వాహనాలను తిరిగి పంపించడం చర్చనీయాంశమైంది. "ప్రమాణ స్వీకారం పూర్తయ్యే వరకు సీఎం కాన్వాయ్ అవసరం లేదు" అని విజయ్ చెప్పినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఆయన రాజకీయంగా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక గవర్నర్‌ను కలవడానికి కూడా ప్రభుత్వ వాహనం ఉపయోగించకుండా వ్యక్తిగత వాహనంలో వెళ్లడం కూడా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**సినీ ప్రముఖుల ఎంట్రీతో వేడెక్కిన రాజకీయాలు**

ఈ వ్యవహారంపై సినీ రంగం నుంచి కూడా స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. నటుడు ప్రకాశ్ రాజ్ ప్రజా తీర్పును గౌరవించాలని వ్యాఖ్యానించారు. "అసెంబ్లీలో బల నిరూపణకు అవకాశం ఇవ్వాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు. కమల్ హాసన్ కూడా గవర్నర్ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "మెజార్టీ నిరూపించాల్సింది శాసనసభలోనే కానీ రాజ్‌భవన్‌లో కాదు" అని గత సుప్రీంకోర్టు తీర్పులను గుర్తు చేశారు. నటుడు విశాల్ కూడా సోషల్ మీడియాలో స్పందిస్తూ, గతంలో ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితుల్లో బలపరీక్షకు అవకాశం ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. తమిళనాడులో మాత్రం ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు.

**ఏం జరగనుందంటే.?**

ప్రస్తుతం తమిళనాడులో మూడు అవకాశాలపై ప్రధానంగా చర్చ సాగుతోంది. మొదటిది.. చిన్న పార్టీల మద్దతు సమీకరించి విజయ్ మెజార్టీ సంఖ్య చేరుకోవడం. రెండోది.. గవర్నర్ చివరకు అతి పెద్ద పార్టీగా టీవీకేను ఆహ్వానించి బలపరీక్షకు అవకాశం ఇవ్వడం.

మూడోది.. పరిస్థితి మరింత క్లిష్టమైతే న్యాయపోరాటం ప్రారంభమవడం. టీవీకే వర్గాలు ఇప్పటికే కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు మద్దతు సమీకరణలో విజయ్ బృందం తీవ్రంగా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఇప్పటివరకు తమిళనాడులో ప్రజలు స్పష్టంగా మార్పునకు ఓటు వేసినా, ఆ మార్పు అధికారంగా మారడానికి ఇంకా రాజకీయ గణితం పూర్తి కాలేదు. అందుకే ప్రస్తుతం చెన్నై రాజకీయం "విజయ్ సీఎం అవుతారా? లేక తమిళనాడు మరో రాజకీయ మలుపు చూస్తుందా?" అన్న ప్రశ్న చుట్టూనే తిరుగుతోంది.





## విద్యార్థులకు రేవంత్ సర్కార్ తీపి కబురు

- బోధన రుసుముల చెల్లింపులపై కీలక నిర్ణయం

**జయభేరి, హైదరాబాద్, మే 7 :**

తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. 202627 విద్యాసంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ముందుగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకే నిధుల విడుదలలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ఏ ఏడాది ఫీజులు ఆ ఏడాదే చెల్లించేలా ఎస్సీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మరోవైపు.. విద్యా వ్యవస్థలో సంస్కరణల నేపథ్యంలో ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను బోర్డు తాత్కాలికంగా రద్దు చేసింది.తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్న ఫీ రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు 202627 విద్యాసంవత్సరం నుండి కొత్త విధానాన్ని తీసుకురాబోతోంది. ఇందుకోసం సంక్షేమ శాఖల నోడల్ విభాగమైన ఎస్సీ సంక్షేమ శాఖ పలు కీలక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ కొత్త విధానం ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అంటే ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికే నిధుల విడుదలలో తొలి ప్రాధాన్యత లభిస్తుంది.ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం.. ఒక విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులను మరుసటి ఏడాది చెల్లించే ఆనవాయితీ ఉంది. దీనివల్ల విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీనిని అధిగమించేందుకు ఇకపై ఏ విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే ఏడాదిలో పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఏటా సుమారు రూ.2,300 కోట్ల నుంచి రూ.2,400 కోట్ల వరకు ఉండే ఈ నిధులను ఒకేసారి విడుదల చేయాలా? లేక విడతల వారీగా ఇవ్వాలా? అనే అంశంపై స్పష్టమైన టైమ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో.. అడ్మిషన్లు ప్రారంభమయ్యేలోపే ప్రభుత్వం దీనిపై పూర్తి స్పష్టత ఇవ్వనుంది.ఇదిలా ఉండగా.. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి విద్యార్థులకు షాక్ ఇస్తూ అడ్మిషన్ల షెడ్యూల్‌ను తాత్కాలికంగా రద్దు చేసింది. మే 4న విడుదల చేసిన అడ్మిషన్ల సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకుంటున్నట్లు బోర్డు కార్యదర్శి ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ కొన్ని కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాలని భావిస్తున్నందున.. పాత షెడ్యూల్‌ను నిలిపివేసి కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు సమాచారం. అడ్మిషన్ల ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావడమే ఈ మార్పుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది.ఈ ఉత్తర్వులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల, మోడల్ జూనియర్ కళాశాలలకు వర్తిస్తాయని చెప్పింది.

## బండి సంజయ్ చర్చకు రా !

ఉన్నమాట అంటే ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. తంబాకు, డ్రగ్స్ తినే అలవాటులో బండి సంజయ్ ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ దాడిని తట్టుకోలేకపోయిన బీజేపీ శ్రేణులు ఆగ్రహంతో ఊగిపోయారు. ప్రెస్ మీట్ జరుగుతున్న టైంలోనే మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడికి తెగబడ్డారు. లోపల ప్రెస్ మీట్ జరుగుతున్న టైంలోనే విధ్వంసం సృష్టించారు. దాడులపై పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై బీజేపీ, కాంగ్రెస్ కలిపి హత్యాయత్నం చేశారని ఆరోపించారు.

ఎమ్మెల్యేపైనే ఈ స్థాయిలో దాడులు చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. తనను చంపేందుకు ఇప్పటికే రెక్కీ నిర్వహించారని ఇదే విషయాన్ని ఉదయం పెట్టిన ప్రెస్ మీట్‌లో చెప్పానని అన్నారు. అదే ఇప్పుడు కనిపించిందన్నారు. తనను చంపేందుకు కత్తులు, బాంబులు, రాడ్లతో వచ్చారని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దారి తప్పిందని చెప్పడానికి వరుసగా జరుగుతున్న ఘటనలే ఉదాహరణ అని అన్నారు.

దాడులు చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. వారిని వెంటనే రిమాండ్‌కు తరలించాలని అన్నారు. తాను ఎవరినీ రెచ్చగొట్టలేదని అన్నారు. బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తాము రియాక్ట్ అయ్యామని అన్నారు.

**పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్**

కరీంనగర్‌లో టెన్షన్ టెన్షన్. మాటలు హద్దు దాటి దాడుల వరకు వెళ్లాయి. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసి తరలించారు. దీనిపై ఆయన మండిపడ్డారు. దాడులు చేసిన వారిని వదిలేసి తనను అదుపులోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టుకు ముందు ప్రెస్‌మీట్ పెట్టిన కౌశిక్ రెడ్డి రేవంత్, బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కరీంనగర్‌లో తుపాకి సంస్కృతి పెరుగుతుందని ప్రశ్నించామని అందుకే బండి సంజయ్, రేవంత్ రెడ్డి కలిసి తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తాను ఎప్పుడూ ఎవరినీ రెచ్చగొట్టలేదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే దానికి తమ పార్టీ నుంచి కౌంటర్ ఇచ్చామన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటున్నారని కామెంట్ చేయడంతోనే తాము కూడా బండి సంజయ్‌పై అనుమానం వ్యక్తం చేశామన్నారు. అలా తంబాకు, డ్రగ్స్ కలిపి తీసుకోవడం వల్లే తలపై జట్టు ఊడిపోయిందని అన్నట్టు చెప్పారు. వారు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే దాడులు చేస్తారా అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు. అందుకే ఎమ్మెల్యేగా తనపై హత్యా యత్నం జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఉన్న తనకే రాష్ట్రంలో రక్షణ లేకుంటే సామాన్యుడి పరిస్థితి ఏంటని నిలదీశారు. ఇలాంటి వారికి అధికారం కట్టబెడితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుందన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా విస్తరణ

ప్రజల నుంచి వినతులు ఎక్కువగా వస్తున్నాయని రంగనాథ్ అన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాను రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైడ్రాకు కబ్జాలపై వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని.. ఆ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే నాలుగు వారాలు ప్రజావాణిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రాకు ఇప్పటికే చాలా ఫిర్యాదులు, దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించడం కోసమే నాలుగు వారాలు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు రంగనాథ్ వివరించారు. హైడ్రాకు వ్యతిరేకంగా కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు హైడ్రా చర్యల కారణంగా ఇప్పటి వరకూ సుమారుగా రూ. 85 వేల కోట్ల విలువైన భూములను కబ్జాల నుంచి కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. మరో సంవత్సరంలోగా రూ.లక్ష కోట్లు విలువైన భూములను కాపాడుతామని స్పష్టం చేశారు. కేవలం హైడ్రా పరిధిలోనే పది లక్షల కోట్ల విలువైన భూములు కబ్జాకు గురైనట్లు సమాచారం ఉందని హైడ్రా కమిషనర్ తెలిపారు. మరోవైపు జూన్ ఎనిమిదో తేదీ నుంచి హైడ్రా ప్రజావాణి కార్యక్రమం తిరిగి ప్రారంభం కానుంది. పెండింగ్ ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలనే ఉద్దేశంతో నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమానికి విరామం ఇచ్చారు.. ప్రజావాణితో పాటు, వివిధ రూపాల్లో వచ్చిన ఫిర్యాదులన్నీ క్లియర్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ విరామాన్ని ప్రకటించినట్లు తెలిపారు. అయితే గతంలో ఇచ్చిన ఫిర్యాదుదారులు అత్యవసరమని భావిస్తే కార్యాలయానికి వచ్చి నేరుగా కలవవచ్చని రంగనాథ్ తెలిపారు. అలాగే ముఖ్యమైన సమస్యలున్నా నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం రోజున ఓ ప్రకటనలో తెలిపారు.

# పార్కు.. రోడ్డు.. తగ్గేదేలే.. దేన్నీ వదల్లే..

- డ్రీమ్ ల్యాండ్ కాలనీలో పార్కు స్థలం కబ్జా
- 33 ఫీట్ల రోడ్డు స్థలానికి ఎసరు..!
- ఇదిగో ప్రైవేటు పాఠశాల మదర్ తెరిసా నిర్వాహకుల ఘనత
- యధేచ్ఛగా మొదలైన నిర్మాణాలు..
- హైడ్రాను సంప్రదించనున్న కాలనీవాసులు..
- మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు..
- నిర్మాణ పనులు నిలిపివేసిన కమిషనర్ సునీతారెడ్డి



**జయభేరి, షాద్ నగర్ :**

కాలనీవాసులకు ఉపయోగపడే పార్కు స్థలం.. అయితేనేమి.. ప్రయాణికులకు ఉపయోగపడే రహదారి స్థలం.. అయినా సరే.. ఖాళీగా స్థలం కనిపిస్తే చాలు.. కబ్జా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టున్నారు.. అడ్డంగా ఆక్రమించడమే కాకుండా నిర్మాణాలు కూడా మొదలుపెట్టారు.. దీనితో ఈ అడ్డగోలు అక్రమణను అడ్డుకునేందుకు కాలనీవాసులు యుద్ధం మొదలుపెట్టారు.. షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో డ్రీమ్ ల్యాండ్ కాలనీ పార్కు స్థలం, అదే విధంగా 33 ఫీట్ల ప్రభుత్వ రోడ్డు కబ్జా అయిన వైనం ఇది. ఇదే ప్రాంతంలో ఉండే మదర్ తెరిసా ప్రైవేటు పాఠశాల నిర్వాహకుల ఆక్రమణ పర్వం ఇది. షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో డ్రీమ్ ల్యాండ్ కాలనీ పార్కు ఉంది. ఇక్కడే మదర్ తెరిసా స్కూలు, మధ్యలో 33 ఫీట్ల రహదారి ఉన్నాయి. సర్వే నెంబర్ 167/పి లో ఉన్న రెండు పార్కు స్థలాలలో ఒకటి మదర్ తెరిసా స్కూల్ ముందు ఉంది. ఇక్కడ ఇటీవల నిర్మాణం ప్రారంభించారు. మున్సిపాలిటీకి సంబంధించిన స్థలంలో ఎవరు కూడా ఇక్కడ లేకపోవడంతో అసలు ఈ నిర్మాణం ఎవరు జరుపుతున్నారు అన్నదానిపై కాలనీవాసులు ఆరా తీశారు. దీనితో ప్రైవేటు పాఠశాల నిర్వాహకులే ఈ దారుణానికి పాల్పడుతున్నట్లు కాలనీవాసులకు అర్థమైంది. ఈ నిర్మాణాలు అడ్డుకోవాలని కోరినప్పటికీ నిర్వాహకులు యధావిధిగా వాటిని కొనసాగిస్తుండడంతో కాలనీవాసులు మోహన్ రెడ్డి, శిల్ప, నరసింహారెడ్డి, గడ్డం నరసింహారెడ్డి, భీమా నాయక్, శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి షాద్ నగర్ మున్సిపాలిటీ కమిషనర్ సునీత రెడ్డికు ఫిర్యాదు చేశారు. దీనితో స్పందించిన మున్సిపల్ కమిషనర్ వెంటనే అక్కడ పనులు నిలిపివేశారు. మున్సిపాలిటీలోని 6వ వార్డులో ఉన్న పార్కు స్థలాన్ని ఆక్రమించి అనధికార నిర్మాణం చేపట్టడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కమిషనర్ కు ఇచ్చిన ఫిర్యాదు పత్రంలో కోరారు. ప్రజల ఉపయోగం కోసం ఉన్న పార్కు, రహదారులు, లేఔట్ ప్లాన్ ఆధారంగా ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశామని, కానీ పార్కు వెళితే సదరు మదర్ తెరిసా పాఠశాల నిర్వాహకులు దీనిని ఆక్రమిస్తున్న వ్యవహారం తమ దృష్టికి వచ్చి ఆందోళన కలిగిస్తుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆమోదించబడిన లేఅవుట్ సరిహద్దులను సరిగ్గా పాటించకుండా పార్కు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతుందన్నారు. కాలనీకి చెందిన కాంగ్రెస్ నేత పి. శ్రీశైలం గౌడ్ ఇంటిముందు 12 అడుగుల మేరకు ఖాళీ స్థలం ఉందని, ప్రహరీ మాత్రం స్థలానికి అనుగుణంగా నిర్మించకపోవడం వల్ల అవకతవకలు ఉన్నట్లు తమకు అనుమానం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పది అడుగుల వెడల్పు గల గేటును ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు ఉన్నాయని, దీనివల్ల ఈ ప్రాంతంలో పార్కు స్థలం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఇక్కడ నియంత్రిత గేటును ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పార్కు స్థలాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పార్కు సరిహద్దులను లేఅవుట్ ప్రకారం నిర్ధారించుకోవాలని కోరారు. ప్రజా వినియోగ స్థలాన్ని పరిరక్షించి నివాసితుల హక్కులను కాపాడాలని కాలనీవాసులు కోరారు. హైడ్రా ను సంప్రదించనున్న కాలనీవాసులు తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకొని పార్కు స్థలాన్ని పరిరక్షిస్తామని మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి వెల్లడించారు.






## సౌర విద్యుత్ పైన రైతులకు అవగాహన

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 07 :**

యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి, చొల్లేరు గ్రామాల రైతులకు వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ పైన అవగాహన కల్పించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలపైన రైతులకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. రైతులను సోలార్‌ను వినియోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు సోలార్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కొండపైన ఉన్న షాపులకు వెంటనే టెండర్లు వేయాలి



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 07:**

యాదగిరిగుట్ట కొండపైన ఉన్న షాపులకు టెండర్లు వేయాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ కు కలిసి కొండపైన ఉన్న షాపులకు టెండర్లు వేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా కొత్త టెండర్లు లేకుండా వారి ఇష్టానుసారంగా వర్తక సంఘాన్ని ఏర్పాటు చేసుకొని, కొత్తవారికి అవకాశం లేకుండా తక్కువ కిరాయిలతో దుకాణాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. స్థానిక నిరుద్యోగులు తక్కువ జీతాలకు దూర ప్రాంతానికి వెళ్లి పని చేయాల్సి వస్తుందని, వీరి వల్ల దేవస్థానానికి నష్టమే కాకుండా భక్తులను కూడా దోపిడీ చేస్తున్నారన్నారు. ఈనెల 31వ తేదీలోపు కొండపైన ఉన్న షాపులకు టెండర్లు వేయకుంటే జూన్ 1 నుండి స్థానిక నిరుద్యోగులందరూ కొండపైకి వెళ్లి కొబ్బరికాయలు, పూలు, పండ్లు, వస్త్రాలు అమ్ముకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడుగు జీవన్ రెడ్డి, కాటబత్తిని ఆంజనేయులు, దేవపూజ అశోక్, గుండు నరసింహ, మిరియాల కృష్ణ, సతీష్ బట్టు, వంగపల్లి అరుణ్, బండి అనిల్, మందోజు నరేష్, కర్రె ప్రవీణ్, గుండు కుమార్, ఆరె కుమార్, కొనే ప్రశాంత్, గోపగాని ప్రసాద్, కర్రే శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 07:**

కురుమ సమాజ ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చారిత్రాత్మిక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ధన్యవాదాలు తెలిపారు. గురువారం యాదగిరిగుట్టలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కురుమ సమాజం కోరుతున్న కోరికను కురుమ ఏకైక ఎమ్మెల్యేగా తాను అడగగానే కురుమ కులాన్ని గౌరవించి ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కురుమ సమాజం తరఫున తమ మాటను వినిపించగా, వెంటనే స్పందించి కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కురుమ అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక పురోగతిని దృష్టిలో పెట్టుకొని తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి కొత్త నమ్మకాన్ని ఇచ్చిందన్నారు. అలాగే కురుమ సమాజానికి సేవ చేసే నాయకుడిని త్వరలోనే కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించడం మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వం అన్ని కులాలను సమానంగా గౌరవిస్తూ, బీసీల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సామాజిక న్యాయం దిశగా ముందుకు సాగుతోందన్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీ సభకు భారీగా తరలిరావాలి

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 07 :**

హైదరాబాద్‌లో జరగనున్న భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు బీజేపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య పిలుపునిచ్చారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు రావడంతో సంతోషంగా ఉందని, ఇప్పటికే భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిజేపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, నేతలు నరేష్, ప్రభాకర్, లెంకలపల్లి శ్రీను, శ్యామ్ సుందర్, బందారపు మల్లేష్, మిర్యాల కృష్ణ, విజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ..
# ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**జయభేరి, కాప్రా :**



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చెర్లపల్లి ఐజీ కాలనీ ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న డ్రైనేజ్ సమస్యపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (HMWSSB) మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డిని కలవడం జరిగింది. 2009 సంవత్సరంలో జేఎన్ఎన్‌యుఆర్ఎం పథకం కింద సుమారు 1200 ఇళ్లు నిర్మించిన ఐజీ కాలనీలో అప్పట్లో ఏర్పాటు చేసిన డ్రైనేజ్ వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. దీనివల్ల మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని, ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. ఈ సమస్య పరిష్కారం కోసం కాలనీ వాసులు పలుమార్లు జీహెచ్ఎంసీ మరియు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులను సంప్రదించినప్పటికీ, శాఖల మధ్య బాధ్యతల విషయంలో స్పష్టత లేకపోవడంతో ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఐజీ కాలనీలో తక్షణమే కొత్త డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరగా వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వెంటనే ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వాటర్ వర్క్స్ ED పంకజని కలవగా ఆమె త్వరలోనే పనులను పరిశీలించి మంజూరు చేయడం జరుగుతుంది అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇళ్లను నిషేధిత జాబితా నుండి తొలగించండి

- తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 07 :**




యాదగిరిగుట్ట, ఆలేరు ప్రాంతాల్లో 22A కింద నిషేధిత జాబితాలో నమోదైన పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన సుమారు 20 వేల ఇళ్లు, ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితా నుండి తొలగించాలని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. గురువారం ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన రెవెన్యూ, గృహ నిర్మాణ అంశాలపై హైదరాబాద్‌లో హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు నిషేధిత జాబితాలో ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపినట్లు, సానుకూలంగా స్పందించిన రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి సమస్యను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సీసీఎల్ఏ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. యాదగిరిగుట్ట రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేయాలని, తుర్కపల్లి మండలానికి అదనంగా మరో 50 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో గతంలో నిర్మించిన ఇళ్లను ఫారెస్ట్ భూములుగా గుర్తించడం వల్ల కొత్త ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు నిలిచిపోయిన విషయాన్ని రెవిన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే సంబంధిత భూములను ఫారెస్ట్ జాబితా నుండి తొలగించి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పెరిగిన రేషన్ కార్డులు సంఖ్యకు అనుగుణంగా ఆలేరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొత్త రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు తెలిపారు.




## గృహాల జాబితా, గృహ జనగణన పై అవగాహన సదస్సు

- సమావేశంలో మాట్లాడుతున్న తాసిల్దార్ రవికుమార్



**జయభేరి, తుర్కపల్లి, మే 07 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని 2027 సెన్సెస్ సందర్భంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చార్జ్ ఆఫీసర్, తాసిల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో మే 11 నుండి జరిపే వారి కార్యకలాపాలను వివరిస్తూ వారికి సహకరించాలని సెక్రటరీలను కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వీయ గణన అంశాన్ని ప్రత్యేకంచి సెక్రటరీలందరూ గ్రామ పరిధిలో ఉన్న యువకులతో, ప్రజాప్రతినిధులతో, పార్టీ పెద్దలతో స్వీయ గణన చేపించాల్సిందిగా కోరారు. స్వీయ గణన వెబ్ పోస్టల్ ద్వారా మే 10 వరకు నమోదు చేసుకోవాలని, మన మండలంలో అత్యధిక సంఖ్యలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఛార్జ్ ఆఫీసర్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఫీల్డ్ ట్రైనర్ అశోక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తాత జ్ఞాపకార్థంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

- ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న పడాల ముఖేశ్ చంద్ర



**జయభేరి, తుర్కపల్లి, మే 07 :**

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన పడాల ముత్యాలు వర్ధంతి సందర్భంగా ఆయన మనుమడు పడాల ముఖేష్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగను పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కూలీల దాహార్తిని తీర్చుటకు మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమని ఉపాధి హామీ కూలీలు అన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో కూలీల ఆరోగ్య భద్రత కోసం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చాంద్ పాషా, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# శ్రీవారి నిత్యరాబడి రూ.21.48 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 07 :**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా గురువారం రూ.21,48,319 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,73,150, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,25,100, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.1,58,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.2,22,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,89,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.65,000, ప్రసాద విక్రయం ద్వారా రూ.8,05,980, కల్యాణకట్ట ద్వారా రూ.65,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వాకిటి రామకృష్ణారావు,ఉత్తరప్రదేశ్ మంత్రి ధర్మవీర్ ప్రజాపతి స్వామి,అమ్మవార్లను వేర్వేరుగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.



## ఛలో పరేడ్ గ్రౌండ్స్

- **మే 10న జరగనున్న భారతీయ జనతా పార్టీ భారీ బహిరంగ సభకు భారత ప్రధానమంత్రి విచ్చేయనున్నారు.**

**జయభేరి, తుర్కపల్లి, మే 07 :**

ఈనెల 10వ తేదీన హైదరాబాదులో నిర్వహిస్తున్న ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలో దేశం కోసం మోడీ, మోదీ కోసం బిజెపి, బిజెపి కోసం తుర్కపల్లి అనే మహా నినాదంతో కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలు కేవలం పదవుల కోసం కాదని, దేశ భవిష్యత్తు కోసం ఉండాలని నిరూపించిన నాయకుడు మోడీ అని, గతంలో దేశ ప్రజలు నిరాశతో ఉన్న సమయంలో ఆశ చూపిన నాయకత్వం మోడీదని నేడు ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గౌరవంగా చూడడానికి కారణం మోడీ తీసుకున్న ధైర్యమైన నిర్ణయాలు, పారదర్శక పాలన దేశభక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బానోతు నరేందర్ నాయక్, చాంద్ పాషా, బానోతు శంకర్ నాయక్, ఆకుల సైదులు, ఆకుల రమేష్, బొల్లు నరసింహ యాదవ్, మాలోతు రమేష్‌నాయక్, బత్తుల అనిల్ కుమార్, గుగులోతు మోహన్ నాయక్ పాల్గొన్నారు.

## గృహప్రవేశానికి హాజరైన ప్రశాంత్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో గురువారం శ్రీధర్ నూతన గృహప్రవేశానికి దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మణిదీప్ కుమారుడి మొదటి పుట్టినరోజు వేడుకల్లో కూడా ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, కేపిఆర్ యూత్ అధ్యక్షుడు పి.రాజు. దొడ్ల శీను, రాచాల రాజు, తిమ్మన్న, విద్యాసాగర్, పడమటి వీరేష్, ప్రభు సాగర్, అరుణ్, అనిల్, యుగేందర్, నవీన్, చంటి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్‌తో రైతులకు అదనపు ఆదాయం

**జయభేరి, శామీర్ పేట్, మే 7:**

వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన పద్ధతులను రైతులు అనుసరించాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అలియాబాద్ లోని రైతు వేదిక వద్ద రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు హాజరయ్యారు. అనంతరం వ్యవసాయ క్షేత్రాల్లో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, తద్వారా వాటి లాభాల గూర్చి అధికారులు రైతులకు వివరించారు. అదేవిధంగా సౌర ఫలకలు, వాటి పనితీరును డెమో రూపంలో రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వ్యవసాయ రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, వాటికి అనుగుణంగా మెలకువలు పాటిస్తూ పంటల సాగు చేయాలని సూచించారు. ఇక సౌర విద్యుత్ ను రైతులు వినియోగిస్తూ కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష , జిల్లా ఆర్టీఏ సభ్యులు జైపాల్ రెడ్డి , మూడుచింతల పల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, సొసైటీ చైర్మన్ మధుకర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఐలయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, వార్డు కౌన్సిలర్ లు జస్వంత్ రెడ్డి, జి .వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి చంద్రకళ , విద్యుత్ శాఖ ఎస్ ఈ కరుణాకర్ బాబు, డి ఈ రాజు జాన్, ఏ డి ఈ అశోక్ రావు , ఏ ఈ వెంకట నారాయణ , మండల వ్యవసాయ అధికారి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్ కుమార్, రవి యాదవ్ మరియు టీ జి ఆర్ డి సి ఓ డిఎమ్ టీ . వేణు గోపాల్ , ఫీల్డ్ అధికారి ఓం ప్రకాశ్, పవన్ కుమార్ రైతు లు సంజీవ్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని పలు శుభకార్యాలకు గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ ధరలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం రైతులు 378 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ వరి ధాన్యాన్ని విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూ.2381 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ. 2070 ధర పలికింది. అలాగే హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూ. 1779 ధర పలికింది. అతి తక్కువగా రూ. 1619 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**జయభేరి, తుర్కపల్లి, మే 07 :**




ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిఎంఆర్ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు చేరవేయాలని, బిజెపి, బిఆర్ఎస్ అరాచకాలను తిప్పి కొట్టాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని, మహిళా అభివృద్ధికి మహిళా బలోపేతానికి కృషి చేస్తున్నారని అన్నారు .కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మహిళలకు ఆరు గ్యారెంటీ లతో పాటు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యము, 500 కే గ్యాస్ సిలిండరు, గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మహిళా శక్తి పథకాల ద్వారా మహిళలు క్యాంటీన్లు పెట్టడానికి ఆర్థిక సహాయం, మహిళలకు పెట్రోల్ బంకులు ఓనరుగా, ఆర్టీసీ బస్సు ఓనర్లుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు . అతివల ఆర్థిక స్వావలంబాన్ని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరా మహిళా శక్తి, మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి మహిళలకు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ముఖ్యమంత్రి ధ్యేయమని అన్నారు. మహిళా రిజర్వేషన్లు 35% బిల్లు వెంటనే అమలు చేయాలని, నారీశక్తి 100 ఆది నియం మహిళా ఆజ్ కరో అభీకరో చాలు కరో నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పోస్ట్ కార్డులపై ఉత్తరాలు పంపించడం జరిగిందని అన్నారు. రాబోవు రోజుల్లో మహిళలకు నామినేటెడ్ పదవులు పిసిసి, డిసిసి కార్యవర్గంలో మహిళలకు స్థానం కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణవేణి, స్టేట్ సెక్రటరీ మౌనిక, మండల అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, కాలే లత, పకీరు సంగీత, బోళ్ల అనిత, భువనగిరి పట్టణ అధ్యక్షురాలు కవిత, మండల కమిటీ మెంబర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, మహిళలు పాల్గొన్నారు.

# నూతన గోదాంల నిర్మాణాలకు మంత్రి సీతక్క శంకుస్థాపన

- **అంగన్వాడీ భవనాల నిర్మాణం, అలాగే టీచర్ల కొరత సమస్యపై మంత్రి సీతక్క దృష్టికి**
- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**జయభేరి, ఉప్పల్ :**




నాచారం ప్రాంతంలోని టీజీ ఫుడ్స్ సంస్థలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, టీజీ ఫుడ్స్ చైర్మన్ ఎఫ్.ఏ. ఫహీమ్, TGIIC చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, కనీస వేతన మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రం (ఐఏఎస్) ఘన స్వాగతం పలికారు.

పర్యటనలో భాగంగా సంస్థలో క్యాంటీన్, నూతన గోదాంల నిర్మాణాలకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అంగన్వాడీ భవనాల నిర్మాణం, అలాగే టీచర్ల కొరత సమస్యపై మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన మంత్రి సీతక్క తక్షణమే చర్యలు తీసుకుంటామని, అవసరమైన ఫైళ్లపై వెంటనే సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్స్ అధికారులు, పలువరు నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి

- **రెవెన్యూ శాఖ మంత్రికి ఎమ్మెల్యే జిఎంఆర్ వినతి**

**జయభేరి, దేవరకద్ర :**




ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఎల్ 3 జాబితాలో ఉన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) విన్నవించారు. హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవిన్యూ అధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష సమావేశాన్నినిర్వహించారు.ఈ సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎల్ 3 జాబితాలో ఉన్న సాంకేతిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని మంత్రిని కోరారు. దేవరకద్ర నియోజకవర్గంలోని మదనాపురం, మూసాపేట్, కౌకుంట్ల మండలాలలో మండల కాంప్లెక్స్ లను కూడా మంజూరు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. అలాగే దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.



## మక్కలతో పాటు జొన్నలు కూడా కొనాలని ప్రభుత్వం నిర్ణయం


- **మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నేత కోన రాజశేఖర్**

**జయభేరి, దేవరకద్ర :**

మక్కలతో పాటు జొన్నలు కూడా కొనాలని ప్రభుత్వం నిర్ణయించిందని మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దేవరకద్ర మండలం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోన రాజశేఖర్ అన్నారు. ఇప్పటికే యాసంగి సీజన్ లో 278 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సుమారు 5.50 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు సేకరించిందన్నారు. రైతులకు నష్టం కలగకుండా కనీసం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. ఇదే తరహాలో జొన్నలు కూడా కొనుగోలు చేయాలని సబ్ కమిటీ నిర్ణయించిందన్నారు. జొన్న పంటను 3.68 లక్షల ఎకరాలలో రైతులు సాగు చేశారని కోన రాజశేఖర్ అన్నారు.

## బండనెర్రలో పుట్టిన పాపం.. నీటి కోసం నిత్య పోరాటం..

- **శ్రీశైలం డ్యాం సమీపంలో ఘాట్ రోడ్డు పక్కన కనువిందు చేస్తున్న చెట్టు**



**జయభేరి, దేవరకద్ర :**

బండ నెర్రలో పుట్టిన పాపానికి ఓ చెట్టు నీటి కోసం నిత్య పోరాటం చేస్తుంది. శ్రీశైలం డ్యాం సమీపంలో ఘాట్ రోడ్డు పక్కన గుట్టపై ఓ చెట్టు బండరాయి నెర్రలోని మట్టి రేణువుల్లో ప్రాణం పోసుకుంది.ఆ మొక్క కాస్త పెరిగి ఇంతింతై.. వడుడింతై.. అన్న చందంగా చెట్టుగా మారింది. దూరం నుండి చూస్తే బండరాయిపై చెట్టు ప్రాణం పోసుకున్నదా..! అన్న భ్రమ చూపరులకు కలుగుతుంది. ఈ చెట్టును చూసి శ్రీశైలం దేవస్థానానికి వచ్చే పర్యాటకులు, భక్తులు కాస్త ఆలోచిస్తున్నారు. ఆ చెట్టును జయభేరి తన కెమెరాలు బంధించింది.

# వడ్లు కొనమంటే అడ్డమైన కొర్రీలా

- వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
- ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుంది
- పాలన చేతకాకుంటే రేవంత్ రెడ్డి దిగిపోవాలి
- కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతో ఇప్పటికే అన్నదాతలకు అపార నష్టం జరిగింది
- వడ్ల కొనుగోలు కేంద్రాలు తిరిగి రైతుల సమస్యలు పరిష్కారం చేయాలి



**జయభేరి, కొండమల్లేపల్లి :**

వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది అని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం కొండమల్లెపల్లి మండలం పెండిపాకుల ధాన్యం కొనుగోలు కేంద్రంను మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక రైతులు అవేదన చెందుతున్నారు అని ఆయన తెలిపారు.ములుగే నక్కపై తాటి పండు పడ్డట్టు రైతు పరిస్తితి ఉంది అని ఆయన అన్నారు.అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయారు అని అన్నారు.గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్తితిలో ప్రభుత్వం లేదు అని అన్నారు. కేసీఆర్ ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదు అని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 2 కేజిల వడ్లు కట్ చేస్తున్నారు అని వెంటనే ఆపాలని కోరారు.మిల్లర్లు 3కేజీలు కట్ చేస్తున్నారు అని ఆయన తెలిపారు.అధికారులు ఏం చేస్తున్నారు కొనుగోలు కేంద్రాల్లో తిరగాలి అని సూచించారు ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుంది అని అన్నారు.పాలన చేతకాకుంటే రేవంత్ రెడ్డి దిగిపోవాలి అని కోరారు రేవంత్ రెడ్డి డిల్లీ వెళ్ళి ఏం సాధించారు అని ఆయన ప్రశ్నించారు.దేవరకొండ ఎమ్మెల్యే సోషల్ మీడియాకే పరిమితం అయ్యారు అని ఆయన అన్నారు.

రైతుల సమస్యలు పట్టించుకొని దేవరకొండ ఎమ్మెల్యే అని ఆయన అన్నారు.వడ్ల కొనుగోలు కేంద్రాలు తిరిగి రైతుల సమస్యలు పరిష్కారం చేయాలి ఆయన కోరారు.మిల్లర్ల వద్ద కమిషన్ లు తీసుకుంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు అని ఆయన తెలిపారు.ఎన్నికల ముందు ఇచ్చిన 7గ్యారంటీలు,420హామీలు అమలు చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు.అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పాడి కౌశిక్ రెడ్డి నీ భరతం పడతాం

- బండి సంజయ్ పై పాడి కౌశిక్ వ్యాఖ్యలకు భగ్గుమన్న బీజేపీ శ్రేణులు
- బండి సంజయ్ కి పాడి బహిరంగా క్షమాపణలు చెప్పాలి
- అరుణ్ రెడ్డి బీజేపీ రాష్ట నాయకుడు

**జయభేరి, గజ్వేల్, వర్గల్ మే 07 :**

పాడి కౌశిక్ రెడ్డి నీకు భరత పూజ చేస్తాం అని బీజేపీ రాష్ట్ర నాయకుడు అరుణ్ రెడ్డి హెచ్చరించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వర్గల్ మండలం గౌరారంలో వర్గల్ మండల బిజెపి ఉపాధ్యక్షుడు మతం మహిపాల్,నియోజకవర్గ నాయకుడు సురేష్ శ్రేణులతో కలిసి అరుణ్ రెడ్డి ఆందోళన చేపట్టారు. పాడి కౌశిక్ రెడ్డి నీకు కరీంనగర్ లో జరిగింది కేవలం శాంపిల్ మాత్రమేనని రాష్ట్రంలో ఎక్కడున్నా నీ భరతం పడతాం అంటూ నేతలు హెచ్చరించారు. కుటుంబాన్ని అడ్డు పెట్టుకుని,ఆత్మహత్య చేసుకుంటానని వేడుకుంటే ఎమ్మెల్యే గా గెలిచిన నీకు మా నాయకుడిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సూసైడ్ స్టార్ నీకు ఏదైనా చేయాలని ఉంటే నీ నియోజకవర్గం హుజురాబాద్ అభివృద్ధి కోసం మా కేంద్ర మంత్రిని కలవు కానీ ఇలా అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోం అంటూ నేతలు అన్నారు. కావున తక్షణమే మా నాయకుడు బండి సంజయ్ పై చేసిన వ్యాఖలను ఉపసంహరించుకుని బహిరంగంగా బండి సంజయ్ కి క్షమాపణలు చెప్పాలని సూచించారు. వారివెంట సీనియర్ నాయకులు మహేష్,ప్రశాంత్,మహేందర్,సుశాంత్,నిఖిల్,సుదర్శన్,మహేందర్ తో పాటు తదితరులున్నారు.

## బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం కంబాలపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో మాజీ దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు. గ్రామస్తులు మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, PACS చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు TVN రెడ్డి, వెల్లుగూరి వల్లపు రెడ్డి, యాసాని రాజవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ PACS చైర్మన్ ముక్కమల్ల బాలయ్య, మాజీ రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్ రావు, కేతావత్ శంకర్ నాయక్, అరేకంటి రాములు, కేతవత్ రవీందర్, కౌన్సిలర్ కేతావత్ రుప్లా, పల్స వెంకటయ్య, సర్పంచులు రయినబోయిన శ్రీను, రాజేందర్ రెడ్డి, కిషన్, హరిలాల్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవం

- తహసిల్దార్ కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరుకు విజ్ఞప్తి చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జయభేరి, షాద్ నగర్, మే 07 :**



హైదరాబాద్ లో హిమాయత్ నగర్ లోని స్టేట్ హౌసింగ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమిపై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని భవిష్యత్తు పేదవాడికి భద్రమైన కల్పించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. సుమారు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ సమావేశంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్ నగర్ నియోజక వర్గంలో ఉన్న నందిగామ, జిల్లేడ్ చౌదరిగూడ, ఫరూఖ్ నగర్ మండల తహసిల్దార్ కార్యాలయాలకు నూతన భవనాలను మంజూరు చేయాలని, ఆర్డీఓ కార్యాలయంకు నూతన భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ లేఖను అందించారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ నూతన భవనాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**జయభేరి, శామీర్ పేట్, మే 7:**



రైతులకు మేలు చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి , మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ లు అన్నారు. నియోజకవర్గంలోని శామీర్ పేట మరియు అలియాబాద్, మూడుచింతల పల్లి లో పర్యటించిన వారు రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ముందుగా శామీర్ పేట మరియు అలియాబాద్,జగన్ గూడ, కేశవరం, లక్ష్మాపూర్, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వారు స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ బిఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లు కంఠం శిరీష కృష్ణారెడ్డి, జాం రవి, కౌన్సిలర్లు విష్ణువర్ధన్ రెడ్డి, జంగారెడ్డి, నీరజ్, మాధవి, శ్రీవాణి, సరిత, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్లు, సహకార సంఘం సభ్యులు రైతులు, నాయకులు వంగ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు డప్పు సాయిబాబా, నాగరాజు,మాజీ సర్పంచ్ సింగం ఆంజినేయులు,మాజీ తదితరులు పాల్గొన్నారు.

## కేఎంపి హెల్పింగ్ హాండ్స్ సొసైటీ సేవలు అభినందనీయం

- ప్రతిరోజు మజ్జిగ పంపిణీ తో ప్రజలు సేద తీరుతున్నారు
- దాత ఎండి లతీఫ్ ను అభినందించిన సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి

**జయభేరి, కొండమల్లేపల్లి :**




కేఎంపి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి అన్నారు.జయంతి హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో వేసవికాలం లో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేసి కార్మికులు, ప్రజల దాహార్తిని తీర్చడం గొప్ప విషయం అన్నారు. సహృదయంతో గురువారం చలివేంద్రానికి పెరుగు పంపిణీ చేసిన భారత్ బైక్ బజార్ యజమాని ఎండి లతీఫ్ ను సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి సన్మానించి అభినందించారు. కెఎంపి హెల్పింగ్ హాండ్స్ మునుముందు గొప్పగా సేవలందించాలని అన్నారు.కేఎంపి హెల్పింగ్ హాండ్స్ సొసైటీకి తాను ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించి తోడుగా ఉంటానన్నారు. వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడమే గొప్ప విషయం అని, అలాంటిది దాతల సహకారంతో ప్రతిరోజు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఏరుకొండ రాము,కూన భానుచందర్, విప్పలపల్లి జితేందర్ యాదవ్, దండు రవికుమార్, సురేందర్ రెడ్డి, బొడ్డుపల్లి మల్లికార్జున్, పి సైదులు, మాధవ్, శ్రీను నాయక్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ కు ఘన స్వాగతం

**జయభేరి, పరవాడ:**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన అల్లూరి స్ఫూర్తి యాత్రలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ విశాఖపట్నంలో యాత్ర ప్రారంభించి లంకెలపాలెం జంక్షన్ మీదుగా నర్సీపట్నం వెళ్తున్న సందర్భంగా లంకెలపాలెం జంక్షన్ లో మండల పార్టీ అధ్యక్షుడు పిల్లా సతీష్, బిజెపి నాయకురాలు మడక పార్వతీ రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆయన చేపట్టిన ఈ యాత్ర దిగ్విజయం కావాలని పండితులచే ఆయనకు ఆశీర్వచనం చేయించి మంగళ హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లంకెలపాలెం జంక్షన్ లోని శ్రీ అభయ ఆంజనేయ ఆలయ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాసరావు, వర్తక సంఘం అధ్యక్షులు తురసాల నరసింగరావు, సాలాపు వెంకట అప్పారావు, బొండా నారాయణరావు, సంపంగి సూరిబాబు, జయతి గోపి, యాదగిరి అప్పారావు, యడ్ల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు వ వర్ధంతి



**జయభేరి, పరవాడ:**

సాయుధ పోరాటంతో స్వాతంత్ర ఉద్యమంలో చరిత్ర సృష్టించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ అన్నారు. గురువారం లంకెలపాలెం జంక్షన్ లో అల్లూరి సీతారామరాజు 102 వ వర్ధంతి కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ ఆదివాసీలపై అకృత్యాలను అడ్డుకున్న మన్యం వీరుడు గిరిజనులతో కలిసి బ్రిటీ సామ్రాజ్యవాదంపై అలుపెరగని పోరాటం చేసి బ్రిటిష్ తుపాకీ కాల్పులకు నేలకొరిగిన విప్లవీరుడు అల్లూరి అన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలకులకి సింహ స్వపనం అన్నారు. సాయి ద పోరాటంతో స్వాతంత్ర ఉద్యమంలో చరిత్ర సృష్టించిన యోధుడు. పిన్న వయసులోనే బ్రిటిష్ పాలకుల ఆకృత్యాలు దురాగతాలను ఎదిరించిన వీరుడు అన్నారు. సీతా రామరాజుకు కృష్ణ దేవి పేట లోని చిటికెల భాస్కర్ నాయుడు ఆశ్రమం కల్పించారు. 1917లో స్నేహితుడు పెరుచర్ల సూర్యనారాయణ తో కలిసి ఆదివాసీలపై బ్రిటీష్ పాలకుల దురాగతాలు అకృత్యాలను సహించలేక వాటిపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు. సిఐటియు నాయకులు వెంకట్రావు అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గుర్రం సుధాకర్ నాయుడు, అప్పికొండ గంగ మహేష్, తోటాడ. వెంకట అప్పారావు, యం. రామకృష్ణ, బి రమణ, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

- వారి కుటుంబానికి బిఆర్ఎస్ అండగా ఉంటుంది
- బిఆర్ఎస్ మండల నాయకులు ముద్దం వీరారెడ్డి

**జయభేరి, తొర్రూరు, మే07 :**

మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఇటీవల కిన్నెర గుంశావాలి అనే వ్యక్తి తన ఇద్దరు కుమారులకు ఉరివేసి తాను ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారి కుటుంబ దినస్థితిని చూసి చలించిపోయిన స్థానిక బిఆర్ఎస్ తొర్రూరు మండల నాయకులు ముద్దం వీరారెడ్డి ముందుకొచ్చి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు ఆ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీగా నా వ్యక్తిగతంగా కూడా వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది

## ఈతకు వెళ్లి ముగ్గురు స్నేహితుల మృతి

- సిద్దిపేట జిల్లాలో విషాదం



**జయభేరి, గజ్వేల్/ వర్గల్ మే 07:**

తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో గురువారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. సరదాగా గడపాలని వెళ్లిన ముగ్గురు యువకులు హల్దీ వాగులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్, వికాస్, ఆనంద్ రెడ్డి (27) స్నేహితులు కలిసి తూప్రాన్ ప్రాంతంలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం తిరుగు ప్రయాణంలో వర్గల్ మండలంలోని నాచారం సమీపంలో ఉన్న హల్దీ వాగు వద్ద కొద్దిసేపు సేదతీరాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురూ వాగులోకి దిగగా, నీటి లోతును అంచనా వేయలేక ప్రవాహంలో చిక్కుకున్నారు.కొంత సేపటి తర్వాత వారు కనిపించకపోవడంతో స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. యువకుల మృతితో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.వేసవి కాలంలో వాగులు, చెరువులు, కాలువల్లో ఈతకు దిగేటప్పుడు యువత అత్యంత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. నీటి లోతు, ప్రవాహం గురించి పూర్తి అవగాహన లేకుండా నీటిలోకి దిగడం ప్రాణాంతకమవుతుందని హెచ్చరిస్తున్నారు.



# బెట్టింగ్ మాయలో పడి...

● కానిస్టేబుల్ దొంగతనాలు, హత్య

**జయభేరి, మెదక్, మే 7 :**

సిద్ధిపేట సీసీఎస్ విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న గౌటి ప్రవీణ్ కుమార్, గత కొన్నేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. 2007లో విధుల్లో చేరిన ఇతను, సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉండి కూడా ఆన్‌లైన్ బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయాడు. ప్రవీణ్ కుమార తన భార్య రజితతో కలిసి గత రెండేళ్లుగా విపరీతంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ సుమారు 60 లక్షల వరకు నష్టపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో రూ. 30 లక్షల వరకు అప్పుల పాలై, వాటిని తీర్చే మార్గం లేక నేరాల బాట పట్టారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో తమకు తెలిసిన వారినే లక్ష్యంగా చేసుకొని కుట్రలు చేశారు. ఈ కేసులో ప్రధాన బాధితుడు సిద్ధిపేటకు చెందిన రియల్టర్ బెల్దె విశ్వనాథం. ప్రవీణ్ కుమారు తన తమ్ముడికి చెందిన ఒక స్థలాన్ని విశ్వనాథం బంధువు వద్ద తాకట్టు పెట్టించి 12 లక్షల అప్పు ఇప్పించాడు. అయితే ఆ ప్లాటును విక్రయించాలని విశ్వనాథం చెప్పగా, ప్రవీణ్ అందుకు నిరాకరించి, మోర మంచి ప్లాటు చూపిస్తానని నమ్మించాడు. గత శనివారం పథకం ప్రకారం, ప్రవీణ్ రజిత ఇద్దరూ విశ్వనాథాన్ని తమ కారులో ఎక్కించుకొని మెట్టుబండల శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. కారులోనే ఉన్న సమయంలో విశ్వనాథం కాళ్లూచేతులు కట్టేసి మెడ చుట్టూ వైరు బిగించి అత్యంత దారుణంగా హత్య చేశారు. హత్య అనంతరం అతని ఒంటిపై ఉన్న సుమారు పది తులాల బంగారు నగలను దొంగిలించారు. ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు మృతదేహాన్ని ఇమాంబాద్ సమీపంలోని ఒక కాలువలో పడేశారు. ఆ తర్వాత దంపతులిద్దరూ కారులో నేరుగా హైదరాబాద్ వెళ్లి, అక్కడ ఒక బంగారు దుకాణంలో నగలను విక్రయించారు. విశ్వనాథం కనిపించకపోవడంతో అతని భార్య వనిత చిన్నకోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆదివారం రాత్రి మృతదేహాన్ని గుర్తించారు.ఏసీపీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో సీసీఎస్ టాస్క్ ఫోర్స్ పోలీసులు లోతైన దర్యాప్తు చేశారు. పోలీసులు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు విశ్లేషించారు. టెక్నికల్ అనాలసిస్ ఆధారంగా విచారణ జరపగా, ప్రవీణ్ కుమార్ కారు కదలికలు అనుమానాస్పదంగా కనిపించాయి. గట్టిగా విచారించడంతో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. మంగళవారం వీరిని అరెస్టు చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించారు. విశ్వనాథం హత్య కేసు దర్యాప్తులో ప్రవీణ్ కుమార్ చేసిన మరో ఘోరం వెలుగులోకి వచ్చింది. గత నెల 25న తన ఇంటికి సమీపంలో ఉండే నర్సవ్వ అనే వృద్ధురాలిని ఆసుపత్రికి తీసుకెళ్తానని కారులో ఎక్కించుకున్నారు. దారి మధ్యలో ఆమెను ఏమార్చి, మెడలోని బంగారు పుస్తెల తాడు చోరీ చేశారు. బంగారం పోయిందని ఏడుస్తున్న వృద్ధురాలిని స్వయంగా ప్రవీణ్ కుమార్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేయించాడు. ఎవరికీ తెలియకుండా డ్రామా ఆడాడు. దొంగిలించిన నగలను కూడా హైదరాబాద్‌లో విక్రయించాడు.

# కేటీఆర్ క్రిమినల్ కేసు



**జయభేరి, హైదరాబాద్, మే 7 :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వరంగల్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ రేపుతోంది. హన్మకొండ 'రైతు సంగ్రామ సదస్సు' వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చట్టపరమైన చిక్కులకు దారితీశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి తదితరుల ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కేటీఆర్‌పై బీఎన్ఎస్ (BNS) యాక్ట్‌లోని సెక్షన్ 504 (శాంతి భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా అవమానించడం), సెక్షన్ 505 (ప్రజా విద్వేషాన్ని ప్రేరేపించే ప్రకటనలు చేయడం) కింద కేసులు నమోదు చేశారు.

# పివిఎన్ఆర్ ఎక్స్ ప్రెస్ వే లో కారు బోల్తా




**జయభేరి, రంగారెడ్డి :**

రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పైన పిల్లర్ నెంబర్ 148వద్ద ఆరంఘర్ నుండి మెహిదీపట్నం వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొట్టి నడిరోడ్డుపై పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఐదు మంది యువకులు ఉన్నారు. వాహనదారుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదానికి గురైన కారును ఫ్లైఓవర్ పై నుండి కిందికి దించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# సువేందు అధికారి పీఏ దారుణ హత్య

**జయభేరి, కోల్ కత్తా, మే 7 :**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి రక్తపాతం చోటు చేసుకుంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 207 స్థానాలతో ప్రభంజనం సృష్టించి, తృణమూల్ కాంగ్రెస్ 15 ఏళ్ల పాలనకు చరమగీతం పాడింది. ఈ విజయాన్ని ఉత్సవంగా జరుపుకుంటున్న వేళ విషాదం చోటు చేసుకుంది. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా ఉండి ఈ గెలుపులో కీలక పాత్ర పోషించిన సువేందు అధికారికి కుడి భుజంగా పేరుగాంచిన చంద్రనాథ్ రథ్ దారుణ హత్యకు గురయ్యారు. కోల్‌కతా శివారు ప్రాంతమైన మధ్యమ్‌గ్రామ్‌లో బుధవారం రాత్రి ఈ దుర్ఘటన జరిగింది. బుధవారం రాత్రి సుమారు పదిన్నర గంటల సమయంలో చంద్రనాథ్ రథ్ తన నివాసానికి మహీంద్రా స్కార్పియో వాహనంలో తిరిగి వెళ్తుండగా ఈ దాడి జరిగింది. మధ్యమ్‌గ్రామ పరిధిలోని దోహారియా జంక్షన్ వద్ద దుండగులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఒక కారు చంద్రనాథ్ కారును ముందు నుంచి అడ్డుకోగా, వెనుక నుంచి మోటార్ సైకిళ్లపై వచ్చిన దుండగులు కారుపై విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. చంద్రనాథ్ కారులో డ్రైవర్ పక్క సీటులో కూర్చొని ఉండగా, దుండగులు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కిటికీ అద్దాల గుండా కాల్పులు జరిపారు.

మొత్తం మూడు నుంచి నాలుగు రౌండ్ల కాల్పులు జరిగినట్టు ప్రాథమిక సమాచారం. ఈ దాడిలో చంద్రనాథ్ శరీరంలోకి మూడు బుల్లెట్లు దూసుకుపోయాయి. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో చంద్రనాథ్ కారు డ్రైవర్ కూడా బుల్లెట్ గాయాలకు గురై, ప్రస్తుతం కోల్‌కతా ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. చంద్రనాథ్‌ను పరీక్షించిన వివా సిటీ ఆసుపత్రి వైద్యులు షాకింగ్ వివరాలు వెల్లడించారు. ఆయన ఛాతీ ఎడమ భాగంలో రెండు బుల్లెట్లు, పొత్తికడుపులో ఒక బుల్లెట్ దిగింది. ఛాతీలోకి దూసుకెళ్లిన బుల్లెట్ ఆయన గుండెను పూర్తిగా చీల్చివేసి అవతలి వైపు నుంచి బయటకు వచ్చాయని, దీని వల్ల ఆయన స్పాట్‌లోనే మృతి చెందారు. ఆసుపత్రికి తీసుకొచ్చే సమయానికే ఆయనలో స్పందన లేని డాక్టర్ ప్రతిమ్ సేన్‌గుప్తా వెల్లడించారు. చంద్రనాథ్ రథ నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఆయన కేవలం ఒక రాజకీయ నాయకుడి అనుచరుడు మాత్రమే కాదు, దేశం కోసం పని చేసిన మాజీ సైనికుడు. చంద్రనాథ్ రథ్ దాదాపు రెండు దశాబ్దాల పాటు భారత వైమానిక దళంలో పని చేశారు. రామకృష్ణ మిషన్‌లో విద్యాభ్యాసం చేసిన ఆయనపై రామకృష్ణ మిషన్ సిద్ధాంతాల ప్రభావం ఎక్కువగా ఉండేది. ఒక దశలో ఆయన ఆధ్యాత్మిక జీవితం వైపు వెళ్లాలని కూడా భావించారు. వైమానిక దళం నుంచి స్వచ్ఛంద పదవి విరమణ పొందిన తర్వాత కొంత కాలం కార్పొరేట్ రంగంలో పని చేశారు 2019లో సువేందు అధికారి మమతా బెనర్జీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో చంద్రనాథ్ ఆయన అధికారిక బృందంలో చేరారు. సువేందు అధికారి 2020లో టీఎంసీని వీడి బీజేపీలో చేరినప్పుడు చంద్రనాథ్ కూడా ఆయన వెంట నడిచారు. తక్కువ కాలంలోనే సువేందుకి అత్యంత సన్నిహితుడిగా, రాజకీయ వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మమతా బెనర్జీపై సువేందు సాధించిన విజయంలో చంద్రనాథ్ కీలక పాత్ర పోషించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఘటన జరిగిన వెంటనే ఆసుపత్రికి చేరుకున్న సువేందు అధికారి తీవ్ర ఆవేశానికి గురయ్యారు. ఇది సాధారణ హత్య కాదని, పక్కా ప్రణాళికతో జరిగిన కోల్డ్ బ్లడెడ్ మర్డర్ అని అన్నారు. గత రెండు మూడు రోజులుగా దుండగులు చంద్రనాథ్ కదలికలపై నిఘా ఉంచి, రెక్కీ నిర్వహించినట్టు సువేందు ఆరోపించారు. కారులో చంద్రనాథ్ ఎక్కడ కూర్చుంటారో కూడా ముందే తెలుసుకుని సరిగ్గా కిటికీ అద్దాల గుండా కాల్పులు జరపడం ఇది ప్రొఫెషనల్ హంతకుల పనేనని ఆయన అన్నారు. గత 15 ఏళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న మహా జింగ్ల రాజ్ ఫలితమే ఇదని ఇలాంటి గూండాలను ఏరిపారేసే పనిని బీజేపీ ప్రారంభిస్తుందని ఆయన హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్ డీజీపీ సిద్ధ్ నాథ్ గుప్తా ఈ కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దర్యాప్తులో కొన్ని కీలక విషయాలు బయటపడ్డాయి. హత్యకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ వాహనంపై ఉన్న నెంబర్ ప్లేట్ నకిలీదని తేలింది. దాన్ని ట్యాపరింగ్ చేశారని పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లైవ్ రౌండ్లు, ఖాళీ తూటాలు ఫోరెన్సిక్ బృందం సేకరించింది. నాలుగు మోటార్ సైకిళ్లై వచ్చి ఉండవచ్చని, దాడి తర్వాత కారు వదిలేసి బైక్‌లపై పరారయ్యారని ప్రాథమిక విచారణలో తేలింది. హత్యపై స్పందించిన టీఎంసీ, తమకు సంబంధం లేదని ప్రకటించింది. ఈ హత్యపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. మొత్తానికి చంద్రనాథ్ రథ్ హత్య బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరక ముందే జరిగిన ఈ ఘటన, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఎలా ఉండబోతోందో సూచిస్తోంది.

# నా మొగుడు నాకే సొంతం

● యూటర్న్ తీసుకున్న సంగీతా...

**జయభేరి, చెన్నై, మే 7 :**



తమిళనాడులో విజయ్ త్వరలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఆయన పార్టీకి మ్యాజిక్ ఫిగర్ రాకపోయినప్పటికీ.. విజయ్ ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. పైగా ఇప్పటికే తన పార్టీ కీలక నేతల ద్వారా కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో మంతనాలు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై డిఎంకె అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ విజయ్ ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదని తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి.. పార్టీ నాయకులతో చర్చలు జరుపుతున్న విజయ్ ఇప్పటికే మంత్రివర్గం కూర్పు పై ఒక క్లారిటీకి వచ్చినట్టు తెలుస్తోందిరాజకీయంగా విజయ్ దూకుడు కొనసాగించినప్పటికీ.. కుటుంబ జీవితంలో మాత్రం విజయ్ ఇబ్బంది పడుతూనే ఉన్నారు. విజయ్ భార్య సంగీత ఎన్నికలకు ముందు ఆయనతో విడాకులు కావాలని కోర్టు మెట్లు ఎక్కారు. ఆయన ఒక నటితో సంబంధాలు కొనసాగిస్తున్నారని.. అందువల్లే ఆయన నుంచి తనకు విడాకులు మంజూరు చేయాలని ఆమె ఆ ఫిర్యాదులో కోరారు. సంగీత భారీగా భరణాన్ని కోరిన నేపథ్యంలో.. విజయ్ అంత మొత్తం ఇవ్వలేదని చెప్పినట్టు అప్పట్లో తమిళ్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత సంగీత కోరిన భరణం మొత్తం ఇస్తానని సంకేతాలు పంపినట్టు కూడా వార్తలు వచ్చాయి.సంగీత, విజయ్ విడాకుల వ్యవహారం కోర్టు మెట్ల దాకా ఎక్కిన నేపథ్యంలో.. ఈ కేసును మే 15 కు చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టు వాయిదా వేసింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి హోదాలో విజయ్ కోర్టు ఎదుట హాజరవుతారా.. లేదా మినహాయింపు కొడతారా.. అనే విషయాలపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ చర్చ ఎలా సాగుతుండగానే విజయ్, సంగీత కు సంబంధించిన మరో వ్యవహారం ఇప్పుడు ఒకటి వెలుగులోకి వచ్చింది..విజయ్ ముఖ్యమంత్రి అవుతున్న నేపథ్యంలో తమిళనాడు ప్రథమ మహిళ హోదాను వదులుకోవడానికి సంగీత సిద్ధంగా లేరని తెలుస్తోంది.

అందువల్లే తాను విజయ్ భార్యగా ఉండేందుకు సిద్ధమని సంకేతాలు పంపినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.. త్రిష రెండో భార్యగా ఉన్నప్పటికీ తనకు ఇబ్బంది లేదని.. తను విజయ్ తో ఉంటానని సంగీత చెప్పినట్టు తెలుస్తోంది. అయితే ఇంతవరకు సంగీత ఈ విషయంలో ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కనీసం తన సోషల్ మీడియా ఖాతా ద్వారా కూడా ఈ విషయాన్ని చెప్పలేదు. కొంతమంది గాసిప్ రాయుళ్లు మాత్రం పిచ్చిపిచ్చిగా వార్తలను ప్రసారం చేస్తున్నారు.. వాస్తవానికి విడాకుల కేసు కోర్టు మెట్ల దాకా వచ్చినప్పుడు సంగీత తన నిర్ణయాన్ని ఎలా వెనక్కి తీసుకుంటారని చాలామంది ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే విజయ్ కొడుకు తండ్రితో చాలా రోజులుగా దూరంగా ఉంటున్నాడు. తన పేరులో ఉన్న విజయ్ ని తొలగించుకున్నాడు.. విజయ్ కూతురు దివ్య కూడా తల్లితో ఉంటున్నది. ఆమె విదేశాలలో చదువుతున్నది. తన తండ్రి ఈ స్థాయిలో విజయం సాధించినప్పటికీ జేసన్, దివ్య ఇంతవరకు ఎటువంటి ప్రకటనలు సోషల్ మీడియాలో చేయలేదు. కనీసం తన తండ్రికి శుభాకాంక్షలు చెప్పినట్టు కూడా వార్తలు రాలేదు. విజయ్ భారీ విజయం సాధించిన తర్వాత ఆయన ఇంట్లో సంబరాలు జరిగాయి. అక్కడ దివ్య కనిపించలేదు..జేసన్ కూడా లేదు. అలాంటప్పుడు విజయ్ తో కలిసి ఉంటానని సంగీత ఎలా అంటారని తమిళ విశ్లేషకులు చెబుతున్నారు.

# మే 17 తర్వాతే సౌత్ కు నైరుతి రుతుపవనాలు

**జయభేరి, చెన్నై మే 7 :**

తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇటీవలే వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. మే 17న రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకుతాయని వెల్లడించింది. దీంతో ఈసారి ముందస్తు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ క్రమంలో తాజాగా ఐఎండీ మరో షాకింగ్ విషయం తెలిపింది. తూర్పు, మధ్య పసిఫిక్ ఉపరితల జల ఉష్ణోగ్రతల్లో కొంత సమయం తటస్థ స్థితిలో ఉన్న తర్వాత ఇప్పుడు అవి ఎల్‌నినో సూచక స్థాయి దిశలో కదలడంతో ప్రపంచ వాతావరణ సంస్థలు ఎల్‌నినో ప్రారంభం అయిందని అధికారికంగా ప్రకటించింది. ఈ మార్పులు గత తటస్థ కాలంతో పోలిస్తే సముద్ర వాతావరణంలో శక్తి విడుదల, గాలుల నమూనాల్లో మార్పులకు దారి తీస్తాయి. ఇన్కాయిస్ ప్రక్రియలో ఈ ఏడాది ఏప్రిల్‌లో వరకు సాధారణ పరిస్థితులు కొనసాగాయని, తాజా డేటా ఆధారంగా ఎల్‌నినో దశలోకి మారినట్లు ప్రకటించింది. ప్రస్తుత మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు స్థిరంగా కొనసాగొచ్చని బులిటెన్ విడుదల చేసింది.పసిఫిక్ జల ఉష్ణోగ్రతలను పరిశీలించేందుకు ఇన్కాయిస్ ప్రత్యేక డీప్ లెర్నింగ్ మోడల్ బేయేసియన్ కన్వల్యూషనల్ న్యూరల్ నెట్వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఈ మోడల్ గత ఎల్‌నినో, లానినా నమూనాలతోపాటు ఇప్పటి డేటాను కలిపి భవిష్యత్ పరిస్థితులను విశ్లేషిస్తుంది. ఇది వచ్చే ఎల్‌నినో లేదా లా నినా ప్రక్రియలను సుమారు 24 నెలల ముందుగా అంచనా వేసే సామర్థ్యాన్ని అందిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇది దేశాలు, వ్యవసాయ, నీటి నిర్వహణ, విద్యుత్ విభాగాలకు ప్రణాళిక రూపకల్పనకు కీలక సాధనంగా మారుతుంది. భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్‌లో ఎల్‌నినో స్థితి ఏర్పడితే, అది భారత నైరుతి రుతుపవనాల ప్రవేశం, బలం, వర్షపాత పంపిణీ మీద గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పలుమార్లు గుర్తించారు.

ఈ సందర్భంలో సాధారణ కంటే తక్కువ లేదా అసమంగా వర్షాలు కురుస్తాయి. కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కొన్ని అధ్యయనాలు ఈ ఏడాది భారత్‌లో వర్షపాతం సగటు కంటే తక్కువగా ఉండొచ్చని, రుతుపవన రాక కొంత ఆలస్యమవుతుందని సూచిస్తున్నాయి.

ఇది వ్యవసాయం, నీటి లభ్యత, విద్యుత్ ఉత్పత్తి, ఆహార ధరల వంటి అనేక రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రభావం పసిఫిక్‌తో పరిమితం కాకుండా, ఉత్తర హిందూ మహాసముద్రంలో కూడా బలమైన, దీర్ఘకాలిక సముద్రపు వేడిగాలుల ఏర్పాటుకు దారి తీస్తోంది. ఈ వాతావరణ ప్రస్థానాలు స్థానిక ఉష్ణోగ్రతల్లో పెరుగుదలతో పాటు పవన వేగం, చక్రవాతాల నమూనాల్లో మార్పులు కలిగిస్తాయి. ఇవి సముద్ర జీవవైవిధ్యం, చేపబట్టు ప్రదేశాలు, ద్వీపు పర్యావరణాలు వంటి అనేక విభాగాలపై ఒత్తిడిని పెంచుతాయి. పర్యావరణ సమతౌల్యం దెబ్బతినడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థలు, ఆహార భద్రత, మానవ ఆరోగ్యానికి పొడుగు సమయ ప్రభావాలు కొనసాగే అవకాశం ఉంది.



# ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు ఆత్మగౌరవం

● నేనావత్ బాలు నాయక్

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలోని రేకులగడ్డ గ్రామానికి చెందిన కవిత డాకు నాయక్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి,ఇంటి యజమానికి శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఆత్మగౌరవం పెరిగిందని, నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేరడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. లబ్దిదారుల ముఖాల్లో కనిపించిన ఆనందం, వారి చేతుల స్పర్శలో కనిపించిన స్వచ్ఛమైన ప్రేమ తనను ఎంతో మంత్ర ముగ్ధుడిని చేసిందన్నారు. గుమ్మానికి కట్టిన మామిడాకుల తోరణంలో పేద కుటుంబాల ఆత్మగౌరవం ప్రతిబింబించిందని పేర్కొన్నారు. రేకులగడ్డ గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జలేందర్ అధికారులు కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయానికి బోర్



**జయభేరి, పి ఏ పల్లి :**

మండలం శ్రీ శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంనికి ఇచ్చిన మాట ప్రకారం బోర్ వేయించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్ నాయక్ పి ఏ పల్లి మండలం నక్కల్ పెంట లో కొలువైన శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయానికి బోర్ కావాలని BRS పార్టీ గ్రామ పంచాయతీ నాయకుల కోరిక వారి కోరికను తీర్చిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్ఆధ్వర్యంలో బోర్ వేయించడం జరిగింది. ఈ కార్యక్రమం నక్కల్ పెంట తండ స్థానిక సర్పంచ్ జటావత్ విమల స్వామి నాయక్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ అజ్మపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ , మాజీ గ్రామ అధ్యక్షులు మాజీ ఉప సర్పంచ్ జోహార్ లాల్ గురు స్వామి మోతిలాల్, దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీధర్, ప్రస్తుత ఉప సర్పంచ్ మునయ్యా నాయక్, కస్న , ధర్మ,అంతి లాల్, జన్న నాయక్,పుర్యైయా,బుగ్గ, లచ్చు,రతన్,గ్రామ పంచాయతీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# బెంగళూరుకు షాకిచ్చిన లక్నో

మిచెల్ మార్ష్ (56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్స్‌లతో 111) మెరుపు శతకంతో విజృంభించడంతో ఆరు ఓటముల తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ ఎట్టకేలకు ఓ విజయం అందు కుంది. గురువారం జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో ఆ జట్టు.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ను 9 పరుగుల తేడాతో ఓడించింది. పలుమార్లు వరుణుడు అంతరాయం కల్గించగా 19 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో లక్నో నిర్దేశించిన 213 పరుగుల ఛేదనలో బెంగళూరు 203/6 వద్దే ఆగిపోయింది. రజత్ పాటీదార్ (31 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 61), టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 40) పోరాడారు. మొదట ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మిచెల్ మార్ష్ సెంచరీకి తోడు నికోలస్ పూరన్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 38), రిషభ్ పంత్ (10 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో లక్నో 19 ఓవర్లకు 209/3 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్నో ఇన్నింగ్స్‌లో మార్ష్ ఆటే హైలైట్. పవర్ ప్లేలోనే భారీ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. హాజిల్‌వుడ్ ఓవర్లో రెండు సిక్స్‌లతో వేట మొదలెట్టిన ఈ హార్డ్ హిట్టర్.. కృనాల్‌కు 4, 6తో స్వాగతం పలికాడు. రసిఖ్ ఐదో ఓవర్లో 97 మీటర్ల భారీ సిక్స్‌కు తోడు మరో రెండుసార్లు బంతిని బౌండరీ లైన్ దాటించాడు. హాజిల్‌వుడ్ వేసిన పవర్‌ప్లే ఆఖరి ఓవర్లో హ్యాట్రిక్ బౌండరీలు బాదిన అతడు.. 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. కృనాల్.. అర్షిన్(17)ను ఔట్ చేయడంతో 95 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అతడే వేసిన 13వ ఓవర్లో సిక్స్‌తో 90లలోకి వచ్చిన మార్ష్.. షెఫర్డ్ బౌలింగ్‌లో వరుస ఫోర్లతో 50 బంతుల్లో సెంచరీని పూర్తిచేశాడు. ఈ లీగ్‌లో మార్ష్‌కు ఇది రెండో శతకం. మార్ష్ నిష్క్రమించినా ఆఖర్లో పూరన్, పంత్ మెరుపులతో లక్నోకు అదిరిపోయే ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. భారీ ఛేదనలో షమీ, ప్రిన్స్ ఆరంభ ఓవర్లలో విజృంభించడంతో బెంగళూరు మొదటి 8 బంతుల్లోనే బెతెల్ (4), కోహ్లీ (0) వికెట్లను కోల్పోయింది. 9 రన్స్‌కే ఓపెనర్లను నష్టపోయిన ఆర్‌సీబీని పడిక్కల్, రజత్ ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఆరంభంలో నెమ్మదిగా ఆడినా క్రీజులో కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించారు. దిగ్వేశ్‌ను లక్ష్యంగా చేసుకున్న రజత్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అయితే సాఫీగా సాగుతున్న ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌కు ప్రిన్స్ తన మూడో ఓవర్లో.. పడిక్కల్, జితేశ్ (1)ను ఔట్ చేసి డబుల్ షాకులిచ్చాడు. 12వ ఓవర్లో బంతినందుకున్న షాబాజ్.. కెప్టెన్‌ను బోల్తా కొట్టించాడు. చివరి ఐదు ఓవర్లలో ఆర్‌సీబీ విజయానికి 80 రన్స్ అవసరమున్న దశలో ప్రమాదకర టిమ్ డేవిడ్ భారీ సిక్స్‌లతో భయపెట్టి ఆర్‌సీబీ శిబిరంలో ఆశలు రేపాడు. కానీ షాబాజ్ అతడిని ఔట్ చేశాడు. కృనాల్ (28 నాటౌట్), షెఫర్డ్ (23 నాటౌట్) ఆ బాధ్యత తీసుకున్నా ఈ ద్వయం తమ జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయింది.

**సంక్షిప్త స్కోర్లు**

లక్నో: 19 ఓవర్లకు 209/3 (మార్ష్ 111, పూరన్ 38, కృనాల్ 1/31, హాజిల్‌వుడ్ 1/49);
బెంగళూరు: 19 ఓవర్లకు 203/6 (రజత్ 61, డేవిడ్ 40, ప్రిన్స్ 3/33, షాబాజ్ 2/33)



# అందుకే ఐపీఎల్ ఫైనల్ అక్కడ..

ఐపీఎల్ 19 ఫైనల్ వేదికను గత సీజన్‌లో టైటిల్ గెలిచిన ఆర్‌సీబీ హోంగ్రౌండ్ చిన్నస్వామికి కాకుండా అహ్మదాబాద్‌కు కేటాయించడంపై లీగ్ చైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్, బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్ 19 ఫైనల్ వేదికను గత సీజన్‌లో టైటిల్ గెలిచిన ఆర్‌సీబీ హోంగ్రౌండ్ చిన్నస్వామికి కాకుండా అహ్మదాబాద్‌కు కేటాయించడంపై లీగ్ చైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్, బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోదీ స్టేడియంలో సీటింగ్ కెపాజిటీ ఎక్కువుండటంతో పాటు కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) తమకు కేటాయించిన ఉచిత టికెట్ల కోటా కంటే ఎక్కువ డిమాండ్ చేయడం వల్లే వేదికను మార్చాల్సి వచ్చిందని అన్నారు. 'చిన్నస్వామి సామర్థ్యం చాలా చిన్నది. అదీగాక అక్కడ రాష్ట్రప్రభుత్వం తరఫున ప్రజా ప్రతినిధులు ఉచిత టికెట్లు అడుగుతున్నారు. మేం కేఎస్‌సీఏతోనూ సంప్రదింపులు జరిపాం. నిరుడు జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ధుమాల్ తెలిపారు. కేఎస్‌సీఏ 10 వేల టికెట్లు ఎక్కువ డిమాండ్ చేసిందని సైకియా పేర్కొన్నారు. 'ఐపీఎల్ ప్రోటోకాల్ ప్రకారం స్థానిక క్రికెట్ సంఘానికి మొత్తం సీట్లలో 15 శాతం కేటాయిస్తాం. కానీ కేఎస్‌సీఏ మాత్రం అంతకుమించి అదనంగా 10 వేల టికెట్లు కావాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం కూడా కాంప్లిమెంటరీ టికెట్ల కింద 700 టికెట్లు కావాలని కోరింది' అని చెప్పారు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దున నిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.
శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

## పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి.ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

## శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

## రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

## సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

## మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

## మొలక పెసర్లు ఓట్స్ చీలా


ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.



# బికినీ వేసుకోమని ఫోర్స్ చేశాడు..




తన కెరీర్ ఆరంభంలో కొందరు వ్యక్తులు తనను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించారని మదాలస శర్మ తెలిపింది. తనకు 19ఏళ్ల వయసులో ఓ చేదు అనుభవం ఎదురైందని తెలిపింది. కథ వినడానికి వెళ్ళినప్పుడు లేదా మీటింగ్స్ సమయంలో కొందరు పరోక్షంగా తప్పుడు సంకేతాలు పంపేవారని తెలిపింది మదాలస శర్మ. అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు మనం ఎలా స్పందిస్తాం అనేదే ముఖ్యం అని మదాలస స్పష్టం చేసింది. ఓ దర్శకుడు సినిమాలో బికినీ వేసుకోవాల్సి ఉంటుందని.. అది నువ్వు వేసుకుంటావో లేదో నాకు ఇప్పుడే, ఇక్కడే నా కళ్ళముందే వేసుకుని చూపించు అని అన్నాడు. అతను అలా అడిగే సరికి షాక్ అయ్యా..! అయితే అక్కడి నుంచి తెలివిగా ఎస్కేప్ అయ్యా అని తెలిపింది. కెమెరా ముందు కథ డిమాండ్ చేస్తే బట్టలు మార్చుకోవడం నా వృత్తి.. కానీ ఇలా ప్రైవేట్ గదిలో ఎవరికో చూపించడం నా వృత్తి కాదు" అని గట్టిగా సమాధానం చెప్పి ఆమె అక్కడి నుంచి వచ్చేశా అని మదాలస శర్మ తెలిపింది. అలాగే మనం ఇచ్చే సంకేతాలను బట్టే ఎదుటివారు ప్రవర్తిస్తారు. నాకు నచ్చని ప్రతిపాదనలు వచ్చినప్పుడు నేను అక్కడి నుండి వెంటనే బయటకు వచ్చేసేదాన్ని అని ఆమె తెలిపింది. అవకాశాల కోసం రాజీ పడాల్సిన అవసరం లేదని, ప్రతిభ ఉంటే గుర్తింపు దానంతట అదే వస్తుందని ఆమె నమ్మకం వ్యక్తం చేసింది. తప్పుడు మార్గాల్లో వచ్చే అవకాశాలు ఎక్కువ కాలం నిలవవని ఆమె చెప్పుకొచ్చింది. మదాలస శర్మ ప్రస్తుతం హిందీ టెలివిజన్ రంగంలో 'అనుపమ' వంటి సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో కూడా 'ఫిట్టింగ్ మాస్టర్', 'ఆలస్యం అమృతం' వంటి సినిమాల్లో నటించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో ఈ అమ్మడు సినిమాలు, సీరియల్స్ లోనూ మెప్పించింది. ఇక సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది.



## జూన్ 13న అందాల సింగర్
# సునీత లైవ్ కాన్సర్ట్


వేదం ఆర్ట్ ఆధ్వర్యంలో జూన్ 13న, శిల్పకళావేదిక హైదరాబాద్‌లో సంగీత ప్రియులకు మరపురాని సంగీత వేడుకగా నిలవనున్న "టైమ్‌లెస్ విత్ సునీత ఉపద్రష్ట" కాన్సర్ట్‌కు సంబంధించిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రముఖ గాయని సునీత ఉపద్రష్ట ముఖ్య అతిథిగా హాజరై మీడియాతో ముచ్చటించారు. కాన్సర్ట్ ప్రత్యేకతలు, సంగీత కాన్సెప్ట్, ప్రేక్షకులకు అందించబోయే అద్భుతమైన సంగీత అనుభూతి గురించి ఆమె ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ కాన్సర్ట్‌లో ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్న ప్రముఖ గాయకుడు శ్రీ కృష్ణ మరియు ధనుజయ్ కూడా మీడియా సమావేశంలో పాల్గొని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, తరతరాల సంగీతాన్ని ఒకే వేదికపై ప్రేక్షకులకు అందించే ఈ ప్రత్యేక కాన్సర్ట్‌లో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. "టైమ్‌లెస్" ద్వారా స్వర్ణయుగంలోని చిరస్మరణీయ గీతాలతో పాటు నేటి ప్రేక్షకులు అభిమానించే మెలోడీలను కూడా అందించనున్నట్లు తెలిపారు. కాన్సర్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ, అమెరికా మరియు భారతదేశంలో భారీ స్థాయి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన వేదం ఆర్ట్స్ సంస్థ హైదరాబాద్‌లో తమ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా "టైమ్‌లెస్ విత్ సునీత ఉపద్రష్ట"ను తీసుకురావడం గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు సంగీత ప్రపంచంలో అత్యంత ఆదరణ పొందిన స్వరాలలో ఒకరిగా సునీతకు ఉన్న ప్రత్యేక స్థానంతో ఈ అనుబంధం తమకు ఎంతో విశేషమని తెలిపారు. సంగీతం, జ్ఞాపకాలు, భావోద్వేగాలను ఒకే వేదికపైకి తీసుకురానున్న ఈ కాన్సర్ట్ హైదరాబాద్‌లో అత్యంత గుర్తుండిపోయే సంగీత సాయంత్రాలలో ఒకటిగా నిలవనుంది. "టైమ్‌లెస్ విత్ సునీత ఉపద్రష్ట" కాన్సర్ట్ టికెట్లు ప్రస్తుతం బుక్ మై షో లో అందుబాటులో ఉన్నాయి.

# మాస్ మెచ్చేలా పవర్ పేట



సందీప్ కిషన్ కథానాయకుడిగా 'పవర్ పేట' పేరుతో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపొందుతున్నది. రచయిత కృష్ణచైతన్య దర్శకుడు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. గురువారం సందీప్‌కిషన్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. అభిమానుల అరుపులు, సంబరాల మధ్య ఓ సినిమా థియేటర్‌లో గ్లింప్స్ మొదలైంది. ఆ కోలాహలం మధ్య హీరో ఎంట్రీ.. సిగరెట్ తాగుతూ, సింహం గురించి పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడంతో థియేటర్‌లో అరుపులు మిన్నంటాయి. థియేటర్ స్క్రీన్‌పై బాణాసంచా విసరడంతో గ్లింప్స్ పూర్తయింది. సందీప్‌కిషన్ ఈ గ్లింప్స్‌లో పీరియాడిక్ అవతార్‌లో కనిపించారు. స్టైలిష్ షేడ్స్, కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్, 'రా' ఆటిట్యూడ్.. ఇవన్నీ మాస్ ప్రేక్షకులు మెచ్చేలా ఉన్నాయి. ఈ గ్లింప్స్‌లోని ఆయన పాత్ర పేరు 'సేనాపతి రవి' అని రివీల్ చేశారు. సందీప్ కిషన్ స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీ ఆ పాత్రలోని డామినేషన్, ఇంటెన్సిటీని సూచిస్తున్నాయి. షూటింగ్ శరవేగంగా పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రానికి కెమెరా: మదీ, సంగీతం: మణిశర్మ, నిర్మాణం: 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్.

# షాకింగ్ విషయాలు చెప్పిన హీరో నందు..
## రోజుకు 100 నుంచి 150 సిగరెట్లు కాల్చాల్సి వచ్చేది..



నందు, అవికా గోర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ థ్రిల్లర్ 'అగ్లీ స్టోరీ' ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రణవ స్వరూప్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రవితేజ మహాదాస్యం, శివాజీ రాజా, ప్రజ్ఞా నయన్ కీలక పాత్రల్లో నటించారు.మే 22న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'భీమ్లా నాయక్' దర్శకుడు సాగర్ కె చంద్ర ట్రైలర్‌ను లాంచ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హీరో నందు మాట్లాడుతూ సినిమాల్లో తన పాత్ర గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ""అగ్లీ స్టోరీ'లో నేను పోషించిన కార్తీక్ పాత్ర నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. హీరోగా కనిపించే వ్యక్తి ప్రతినాయకుడి కోణంలో ఉండే కథలు తెలుగులో చాలా అరుదుగా వస్తాయి. అందుకే ఈ సినిమా నాకు ఛాలెంజ్‌గా అనిపించింది" అని అన్నారు.

షారుఖ్ ఖాన్ నటించిన 'డర్', 'బాజీగర్', అలాగే ఫాహద్ ఫాజిల్ చేసిన '22 ఫిమేల్ కొట్టాయం' సినిమాల నుంచి ఇన్స్పిరేషన్ తీసుకున్నానని నందు తెలిపారు. "ప్రతి సినిమాలో రాముడి లాంటి పాత్రలే చూస్తుంటాం. కానీ రావణాసురుడి కోణంలో కథ చెప్పాలని అనిపించింది. ఆ ఆలోచనతోనే ఈ సినిమా చేశాను" అని పేర్కొన్నారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో తాను పూర్తిగా పాత్రలోకి వెళ్లిపోయానని నందు వెల్లడించారు. "ఒక షెడ్యూల్ సమయంలో రోజుకు 100 నుంచి 150 సిగరెట్లు కాల్చాల్సి వచ్చేది. నిజానికి నాకు సిగరెట్లు అంటే అసహ్యం. కానీ పాత్ర కోసం చేయాల్సి వచ్చింది. ఇంటికి వెళ్లాక తీవ్ర తలనొప్పి, చిరాకు వచ్చేది" అని చెప్పారు. అంతేకాకుండా దర్శకుడు ప్రణవ్ తన భార్య గీతా మాధురికి ఫోన్ చేసి ప్రత్యేకంగా చెప్పారని నందు గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరుగుతున్న రోజుల్లో మా హీరో ఇంట్లో విలన్‌లా ప్రవర్తించినా ఏమనుకోవద్దని గీతాకు డైరెక్టర్ చెప్పాడు. ఎందుకంటే నేను పూర్తిగా క్యారెక్టర్ మూడ్‌లో ఉండిపోయేవాడిని అని తెలిపారు. కొన్ని రోజులు ఇంటికి వెళ్లాక కూడా ఒంటరిగా రూమ్‌లో ఉండిపోయేవాడినని నందు చెప్పారు. "పిల్లలతో ఆడుకునే మూడ్‌లో కూడా ఉండేవాడిని కాదు. పాత్ర మానసికంగా చాలా ప్రభావం చూపించింది" అని వెల్లడించారు. హీరోయిన్ అవికా గోర్ కూడా సినిమా గురించి భావోద్వేగంగా మాట్లాడారు. "నా కెరీర్‌లో తొలిసారి ఒక సినిమా చేస్తూ అసౌకర్యంగా అనిపించింది. ఎందుకంటే ఈ కథలోని పరిస్థితులు నిజ జీవితంలో కూడా చాలామంది ఎదుర్కొంటున్నారు. అది నాకు చాలా బాధ కలిగించింది" అని అన్నారు.

# అబ్బా..! ఏం అందం గురూ..!!

సీరియల్స్ తో తన నటనతో.. సోషల్ మీడియాలో తన అందంతో ఆకట్టుకుంటున్న బ్యూటీస్ లో ఈ భామ ఒకరు. సీరియల్స్ లో బెస్ట్ సీరియల్ గా నిలిచిన వాటిలో బ్రహ్మముడి సీరియల్ ఒకటి. ఈ సీరియల్ కు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. టాప్ రేటింగ్ తో దూసుకుపోతున్న ఈ సీరియల్ లో నటించిన నటీనటులు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. ప్రతి క్యారెక్టర్ ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా నటించారు. వారిలో ఇక ఈ సీరియల్ లో స్వప్న అనే పాత్ర కూడా ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యింది. ఆ పాత్రలో మొదట్లో.. హమీదా ఖాతూన్ నటించింది. కానీ ఇప్పుడు ఆమె ప్లేస్ లోకి మరో నటి వచ్చింది. బ్రహ్మముడి సీరియల్ లో స్వప్న పాత్రలో రూప ముగ్గల నటిస్తుంది. ఈ చిన్నది ఎన్నో సీరియల్స్ లో నటించి మెప్పించింది. ఈ చిన్నది సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది. రీల్స్, ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడు తన గ్లామర్ తో కవ్విస్తుంది. చీరకట్టులో కూడా తన అందంతో కుర్రాళ్ళ మనసు దోచేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ కొన్ని రీల్స్, ఫోటోలు షేర్ చేసింది. ఈ ముద్దుగుమ్మ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. నెటిజన్స్ ఈ ఫోటోలకు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**